# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

మంగళవారం, 28 మే, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రాజకీయ నాయకురాలిననే.. బెయిల్ అడ్డుకుంటున్నారు

**సామాన్యులకున్న హక్కులు కూడా ఉండవా**

**ఢిల్లీ హైకోర్టులో ఎమ్మెల్సీ కవిత వాదనలు**



**ఢిల్లీ:** ఢిల్లీ మద్యం కేసులో తనను అరెస్టు చేసే విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిబంధనలను ఉల్లంఘించినందున బెయిల్ ఇవ్వాలని భారాస ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు జారీచేసేంతవరకూ తనకు సమన్లు జారీచేయబోమని అడిషినల్ సొలిసిటర్ జనరల్ సర్వోన్నత న్యాయస్థానానికి వాగ్దానం చేసినా, దాన్ని తుంగలో తొక్కి ఈడీ తనను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కేవలం రాజకీయ నాయకురాలినన్న కారణంతో ఈడీ తన బెయిల్‌కు అడ్డుపడుతోందని, సామాన్యులకున్న హక్కులుకూడా తనకు ఉండవా? అని ప్రశ్నించారు. తన బెయిల్ అప్లికేషన్లను కొట్టివేస్తూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును - 2లో

# అసమ్మతి, ప్రతిపక్ష నేతలపై
# అక్రమ నిఘా!



**ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులను వదలని ప్రభాకర్‌రావు**

**ఓ కీలక వ్యక్తి కోసం కేరళకు చార్టర్డ్ ఫ్లైట్‌లో వెళ్లిన పోలీసులు**

**'ఎమ్మెల్యేలకు ఎర' ఆపరేషన్‌లో టాస్క్‌ఫోర్స్ కీలకపాత్ర**

**తమ నేరాంగీకార వాంగ్మూలాల్లో నిందితుల వెల్లడి**

**హైదరాబాద్:** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఈ నిఘా కేవలం ప్రతిపక్ష నేతలకే పరిమితం కాలేదని, అధికార బీఆర్ఎస్‌కు చెందిన అసమ్మతి నేతలపైనా సాగినట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు నేతృత్వంలో అనేక అక్రమాలు సాగాయని నేరాంగీకార వాంగ్మూలాల్లో పోలీసులు పేర్కొన్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఆపరేషన్ కోసం అవసరమైన నిఘా పరికరాలను ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి కొనుగోలు చేయగా... కేరళకు చెందిన ఓ కీలక వ్యక్తిని పట్టుకోవడానికి పోలీసులు ఏకంగా చార్టర్డ్ ఫ్లైట్‌లో అక్కడకు వెళ్లినట్లు బయటపడింది. పంజగుట్ట పోలీసులు గతంలో అరెస్టు చేసిన మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు, డీఎస్పీ నాయిని భుజంగరావులకు సంబంధించిన నేరాంగీకార వాంగ్మూలాల్లో ఈ కీలకాంశాలను పొందుపరిచిన దర్యాప్తు అధికారులు.. వీటిని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

**రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఆపరేషన్**

దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవడంతో ఆ పార్టీకి బ్రేక్ వేయాలని నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించుకున్నారు. 2022 అక్టోబర్ చివరి వారంలో నాటి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ద్వారా ఓ కీలక విషయం కేసీఆర్‌కు తెలిసింది. బీఆర్ఎస్‌ను వీడి తమ పార్టీలో చేరేలా బీజేపీకి చెందిన కొందరు వ్యక్తులు ఎర వేస్తున్నారంటూ రోహిత్‌రెడ్డి నాటి సీఎంకు చెప్పారు. అప్పటికే మునుగోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీని - మిగతా 2వ పేజీలో

## ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

- కేసీఆర్‌ను అరెస్ట్‌చేసి ప్రాసిక్యూట్ చేయాలి
- ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి

## ఫోన్ ట్యాపింగ్ దేశ భద్రత అంశం

- శ్రీధర్ రెడ్డి హత్యపై విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్



## ఉద్యమం ప్రతిబింబించేలా అధికారిక చిహ్నం!

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం తుది మెరుగులు దిద్దుకుంటోంది. ప్రముఖ చిత్రకారుడు రుద్ర రాజేశం ఈ చిహ్నాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన నేతృత్వంలోని బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. సుమారు 12 నమూనాలు రూపొందించగా.. వాటిలో ఒకటి సీఎం రేవంత్‌రెడ్డి ఖరారు చేశారు. ఎంపిక చేసిన దానిలో కొన్ని మార్పులు సూచించారు. గత చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణం ఉన్నాయి. అయితే, రాచరికపు ముద్రల బదులుగా ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం ప్రతిబింబించేలా ఉండాలని సీఎం భావిస్తున్నారు. ఈ మేరకు రూపొందే చిహ్నాన్నే.. జూన్ 2న ఆవిష్కరించనున్నారు. ఇక రాష్ట్ర గీతంగా ఖరారు చేసిన 'జయ జయహే తెలంగాణ'కు తుది మెరుగులు దాదాపు పూర్తయ్యాయి. సీఎం సూచనలతో భావం, భావోద్వేగం మారకుండా రెండు నిమిషాల గీతంలో కవి అందెశ్రీ మార్పులు చేశారు. సీఎం రేవంత్, అందెశ్రీ సూచనలకు అనుగుణంగా సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి స్వరకల్పన చేశారు. ఈ గీతాన్ని కూడా జూన్ 2న ఆవిష్కరించనున్నారు. మరోవైపు తెలంగాణ తల్లి రూపం ఓ కొలిక్కి వస్తున్నట్లు సమాచారం.



## ఎమ్మెల్సీ పోలింగ్ 72.37%

**ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక**

**సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన పోలింగ్**

**ములుగు జిల్లాలో అత్యధికంగా 74.54, శాతం..**

**ఖమ్మం జిల్లాలో అత్యల్పంగా 65.54 శాతం**

**జూన్ 5న కౌంటింగ్.. 3 రోజులపాటు కొనసాగే అవకాశం**

**నల్లగొండ/ ఖమ్మం:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ చిన్న ఘటనలు మినహా పోలింగ్ సజావుగా జరిగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు సాగింది. పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగియాల్సి ఉన్నా ఓటర్లు బారులు తీరారు. ఆ సమయంలోగా పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చిన అందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది. మొత్తంగా 72.37 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల కౌంటింగ్ జూన్ 5న జరగనుంది. ఈ ఉప ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉండటంతో బ్యాలెట్ పేపర్‌కూడా భారీగానే ఉంది. దీంతో కౌంటింగ్ ప్రక్రియ మూడు రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**గతంలో కంటే తగ్గిన పోలింగ్:** మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 కొత్త జిల్లాల్లో గతంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం కంటే ఈసారి పోలింగ్ శాతం తగ్గిపోయింది. 2021 ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా అందులో 3,85,996 మంది (76.35 శాతం) ఓటువేశారు. ఈసారి 4,63,839 మంది మాత్రమే ఓటు నమోదు చేసుకున్నారు. ఈసారి పోలింగ్ 68.65 శాతం - 2వ పేజీలో



## ఉత్తమ్ తెలివిగా తప్పించుకున్నారు

**పౌరసరఫరాల శాఖలో అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**

**ఈ అవినీతి, అక్రమాలపై కేంద్రానికి లేఖ రాస్తా... మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి అనుమతితోనే సీఎంను కలవడానికి వెళ్లా**

**పైరవీలతో బీజేఎల్పీ పదవి తెచ్చుకోలేదు**

**బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**హైదరాబాద్:** పౌరసరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేదా ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ శాఖలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి పూర్తి ఆధారాలతో లేఖ రాస్తామని వెల్లడించారు. సోమవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తాను చేసిన ఆరోపణలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆలస్యంగా స్పందించినా.. ప్రజల పక్షాన తాను అడిగిన 19 ప్రశ్నల్లో ఒక్కదానికే మాత్రమే సమాధానం చెప్పి తెలివిగా తప్పించుకున్నారన్నారు. మిగతా వాటికి సమాధానం ఏదని నిలదీశారు. సన్న బియ్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం దగ్గర ఉన్న నిల్వలనే మిల్లింగ్ చేయిస్తామని, అందుకు ముందుగా ఇచ్చిన టెండర్‌ను రద్దు చేస్తామని ఇప్పుడు చెబుతున్నారని అన్నారు. ఈ విషయాన్నే తాను ప్రశ్నించానని, ప్రభుత్వం దగ్గర ఉన్న వడ్లనే మిల్లింగ్ చేస్తే.. క్వింటాలుకు రూ.3,500లకే వస్తాయి కదా, మరి వేలంలో క్వింటాలుకు రూ. 5,700లకు కొనడం ఎందుకో చెప్పాలన్నారు. గతంలో ఎన్నడూ క్వింటాలుకు రూ.4,000కి మించి టెండర్ ఇవ్వలేదని, ఇప్పుడు ఇంత మొత్తం ఇవ్వడం వెనక మతలబు ఏమిటని ప్రశ్నించారు. గతంలో తప్పులు చేసిన మిల్లర్లను ఎంత మందిని డిఫాల్టర్లుగా గుర్తించారో ముందు ఆ జాబితా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన మిల్లర్లపై చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని.. దానిని తాము కాదనడం లేదని, అయితే ఆ తప్పులను సాకుగా చూపి, మరో మార్గంలో వసూళ్లకు పాల్పడటాన్ని తాము ప్రశ్నించామన్నారు. తడిసిన ధాన్యం గింజ లేకుండా కొనుగోలు చేశామని చెబుతున్నా వాస్తవ పరిస్థితి అలా లేదన్నారు. 'అసలు మంత్రి కనీసం కొనుగోలు కేంద్రాలకు వెళితే కదా.. ఆయనకు రైతుల కష్టాలు - మిగతా 2వ పేజీలో

## వైభవంగా అవతరణ ఉత్సవాలు

**2న గన్‌పార్కు వద్ద అమరవీరులకు సీఎం నివాళులు**

**పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర గీతం ఆవిష్కరణ, సీఎం ప్రసంగం**

**సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై భారీ సాంస్కృతిక కార్యక్రమాలు.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2న ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి తెలిపారు. ఆదివారం ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన అమరులకు సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించిన అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఆయా ఏర్పాట్లపై సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... "ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత సీఎం సందేశం ఉంటుంది. సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై రాష్ట్రంలోని అన్ని కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్ ఉంటుంది. శిక్షణ పొందుతున్న 5,000 మంది పోలీస్ అధికారులు బ్యాండ్‌తో పాల్గొంటారు. దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేసి హస్తకళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనలో ఉంచుతారు. నగరంలోని పేరొందిన హోటళ్లు ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. కార్యక్రమానికి హాజరయ్యే నగర పౌరులతో వచ్చే పిల్లలకు పలు క్రీడలతో కూడిన వినోదశాలలను ఏర్పాటు చేశాం. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం బాణసంచా ప్రదర్శన, లేజర్ షో ఉంటాయి. ఆ రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలి" అని ఆదేశించారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దానకిశోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాసరాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, అదనపు డీజీలు సంజయ్‌కుమార్ జైన్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్, హెచ్ఎండీఏ అదనపు కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు. జూన్ 2న గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకూ అన్ని ప్రభుత్వ విభాగాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని సీఎస్ ఎ.శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, మేయర్లు, - మిగతా 2వ పేజీలో

# టీజీపీఎస్సీ కీలక నిర్ణయం

**నిపుణుల కమిటీ ఆధ్వర్యంలోనే ప్రాథమిక కీ వెల్లడి**

**అభ్యర్థుల్లో గందరగోళం నివారణకు కార్యాచరణ**




**హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పోటీ పరీక్షల 'కీ' (సమాధానాల) సమస్యలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చెక్ పెట్టనుంది. ప్రాథమిక కీ వెలువడినప్పటి నుంచి తుది కీ ఖరారయ్యే నాటికి అభ్యర్థుల్లో తలెత్తుతున్న సందేహాలు, గందరగోళ పరిస్థితులను దూరం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అభ్యర్థులకు మానసిక ఆందోళనను దూరం చేసేందుకు గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానంలో సంస్కరణలు చేపట్టింది. ఇక నుంచి ప్రాథమిక కీ విడుదల సమయంలోనే సమాధానాల్లో ప్రాథమిక తప్పులను గుర్తించి వాటిని సరిచేస్తూ సరైన సమాధానాలతో కీ ప్రకటించాలని నిర్ణయించింది. తద్వారా పరీక్ష రాసిన అభ్యర్థులకు ప్రాథమిక కీ సమయంలోనే ఎన్ని మార్కులు వస్తాయి? మెరిట్ సాధిస్తామా? లేదా.. వంటి అంశాలపై ముందుగానే స్పష్టత రానుంది. భవిష్యత్తులో నిర్వహించే పోటీపరీక్షలన్నింటిలోనూ ఇదే విధానాన్ని కమిషన్ అనుసరించనుంది.

**అభ్యర్థుల్లో గందరగోళం..:** పోటీపరీక్షలు నిర్వహించిన తరువాత కమిషన్ నిబంధనల ప్రకారం తొలుత అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలు స్కానింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ ముగిసిన తరువాత డిజిటల్ ఓఎంఆర్ పత్రాలను వెబ్‌సైట్లో పొందుపరిచి ప్రాథమిక కీ ప్రకటిస్తారు. ఇంతవరకు అనుసరించిన విధానం ప్రకారం ప్రాథమిక కీ విడుదల చేసేటప్పుడు ప్రశ్నపత్రం రూపొందించిన నిపుణులు చెప్పిన సమాధానాన్ని అందులో పొందుపరిచేవారు. ఆ తరువాత ప్రాథమిక కీపై అభ్యర్థుల నుంచి నిర్ణీత గడువులోగా అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించేవారు. ఈ అభ్యంతరాలకు సరైన ఆధారాలు జతచేయాలి. లేకుంటే వాటిని పరిగణనలోకి తీసుకోరు. ఈ తరహా విధానంతో అభ్యర్థుల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనేవి. ప్రాథమిక కీ నాటికి వస్తున్న మార్కులకు.. తుది కీ నాటికి వస్తున్న మార్కులకు వ్యత్యాసం కనిపిస్తుండేది. కొన్ని సందర్భాల్లో ఒక్క మార్కు తేడాతో ర్యాంకుల్లో చాలా వెనుకబాటు కనిపిస్తోంది. దీంతో మార్కులు తగ్గాయన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంటోంది. గతంలో కొన్ని సందర్భాల్లో న్యాయ వివాదాలు తలెత్తి నియామక ప్రక్రియ ఆలస్యమైంది. గత ఏడాది కమిషన్ నిర్వహించిన 8,180 గ్రూప్-4 సర్వీసు ఉద్యోగాల పోటీపరీక్షలోనూ ప్రాథమిక కీ నుంచి తుది - మిగతా 2వ పేజీలో

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు ఉత్సవాలు

**3 రోజులపాటు నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ ఆదేశం**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలు'ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 1 నుంచి మూడు రోజులపాటు బీఆర్ఎస్ అధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరపాలని ఆదేశించారు. 14 ఏళ్లు పోరాడి తెలంగాణను సాధించి, స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వానిదేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సూచనలను అనుసరించి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా వేడుకల్లో పెద్దఎత్తున పాల్గొని - మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
మంగళవారం, 28 మే, 2024

## ఉత్తమ్ తెలివిగా తప్పించుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

తెలిసేది. హైదరాబాద్‌లో కూర్చొని అంతా బాగుంది.. అని జబ్బలు చరుచుకుంటే సరిపోదు'అని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో కల్లాల్లో పర్యటించి రైతులు సమస్యలు తెలుసుకున్నారని గుర్తుచేశారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి అనుమతితోనే తాము రైతుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తే దానిని వక్రీకరించి మాట్లాడడం మంత్రి ఉత్తమ్‌కే చెల్లిందన్నారు. అది సీఎంను అవమానించడమే అవుతుందన్నారు. కాగా, తానేమీ పైరవీలతో బీజేఎల్పీ పదవి తెచ్చుకోలేదని, పార్టీనాయకులు, ఎమ్మెల్యేలు కలిసి తనను ఎన్నుకున్నారని స్పష్టంచేశారు. గతంలో టీపీసీసీ చీఫ్ పదవిని ఉత్తమ్ ఎలా తెచ్చుకున్నారో తనకు బాగా తెలుసునన్నారు. మంత్రి ప్రెస్‌మీట్లు పెట్టి చేతులు దులుపుకుంటే, తప్పులు ఒప్పులుగా మారవన్నారు. వాస్తవాలు బయటకు రావాలంటే నిపుణుల కమిటీ వేసి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

## వైభవంగా అవతరణ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్, జడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్లు, అన్ని శాఖల విభాగాధిపతులు పాల్గొనాలని కోరారు. ఎక్కడా ప్లాస్టిక్ జెండాలను వాడొద్దని స్పష్టంచేశారు.

### పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్ల పరిశీలన

**కంటోన్మెంట్:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం సీఎస్ శాంతికుమారి పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వేదిక, బారికేడింగ్, విద్యుత్తు, మంచినీటి సరఫరా, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు తదితరాలపై ఆరా తీశారు. బందోబస్తు, ట్రాఫిక్, వీఐపీల రాకపోకలకు అంతరాయం కలగకుండా చేపడుతున్న చర్యలు, వాహనాల పార్కింగ్ వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యర్, శ్రీనివాసరాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, అదనపు డీజీ సంజయ్‌కుమార్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు తదితరులు ఉన్నారు.

## టీజీపీఎస్సీ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

కీ నాటికి మొత్తం పది ప్రశ్నలు తొలగించారు. ఈ మేరకు పేపర్–1లో 7, పేపర్–2లో 3 ప్రశ్నలు ఉన్నాయి. వీటితో పాటు రెండు పేపర్లలో కలిపి 13 ప్రశ్నల సమాధానాల్లో మార్పులు జరిగాయి. 5 ప్రశ్నలకు ఒకటి కన్నా ఎక్కువ సమాధానాలు సరైనవిగా ప్రకటించాల్సి వచ్చింది. రద్దయిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలోనూ తుది కీ వెలువడే నాటికి 8 ప్రశ్నలు తొలగించారు. రెండు ప్రశ్నలకు ఆప్షన్లు మారాయి. ఇదే తరహాలో ప్రతి పోటీపరీక్షలో ప్రశ్నల తొలగింపు, సమాధానాల మార్పు సాధారణంగా జరుగుతోంది. దీంతో అభ్యర్థుల మార్కుల అంచనాలు మారుతున్నాయి. ఈ మేరకు అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితులు నివారించేందుకు ప్రాథమిక కీ సమయంలో సబ్జెక్టు నిపుణుల అభిప్రాయాన్ని కమిషన్ తీసుకుంటోంది. ప్రాథమిక కీ విడుదల చేసేటప్పుడు ఆ అభిప్రాయం మేరకు సరైన సమాధానాలతో వెలువరిస్తుంది. తద్వారా ప్రాథమిక కీపై వెలువడే అభ్యంతరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. ప్రాథమిక కీ.. తుది కీ నాటికి పెద్దగా మార్పులు ఉండకపోవడంతో అభ్యర్థులకు వచ్చే మార్కులపై ముందుగానే అవగాహన వస్తుంది.

## రాజకీయ నాయకురాలిననే.. బెయిల్ అడ్డుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

సవాల్‌చేస్తూ కవిత ఢిల్లీ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్లపై సోమవారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ సందర్భంగా కవిత తరఫున సీనియర్ అడ్వొకేట్ విక్రమ్ చౌధరి సుదీర్ఘ వాదనలు వినిపించారు. "నాకు ఈడీ తొలుత 2023 మార్చి 8న సమన్లు జారీచేసింది. అయితే సీబీఐ సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద సమన్లు జారీచేసి ఇంటికొచ్చి విచారించినందున మీరూ అలాగే చేయాలని ఈడీని కోరాం. కస్టడీలో ఉన్న వ్యక్తిని ముఖాముఖి విచారించాల్సి ఉన్నందున ఈడీ ఆఫీసుకు రావాల్సిందేనని చెప్పారు. వారు చెప్పింది నమ్మి నేను 2023 మార్చి 11న ఢిల్లీలోని ఈడీ ఆఫీసుకు వస్తే పొద్దుపోయే వరకూ నన్ను కూర్చోబెట్టారు. ఆ సమయంలో వారు మొబైల్ ఫోన్లు అడగడంతో ఇచ్చాను. అందులో వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన విషయాలూ ఉంటాయి. ఫోన్‌ను ఓపెన్ చేసే విషయంపై నేను సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశాను. ఈ కేసు పెండింగ్‌లో ఉండగానే నన్ను హాజరుకావాలని ఒత్తిడి చేయడంతో 2023 మార్చి 20న రెండోసారి ఈడీ ముందు హాజరయ్యాను. 2022 నవంబర్‌లో దాఖలుచేసిన రిమాండ్ రిపోర్ట్‌లో నేను ఫోన్లు ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. యాపిల్ కొత్త మోడల్ వస్తే ఫోన్ మార్చుకుంటూ ఉంటాను. నేను కొత్త ఫోన్ కొన్నప్పుడల్లా పాత వాటిని మా దగ్గర పనిచేసే ఉద్యోగులకు ఇస్తూ వచ్చాను. నాపై వచ్చిన ఆరోపణలను నివృత్తి చేయడానికి ఇదివరకు ఉద్యోగులకు ఇచ్చిన 11 పాతఫోన్లను సేకరించి ఈడీకి ఇచ్చాను. అందులో 4 ఫార్మట్ అయ్యాయి. వాటిని తీసుకున్న ఉద్యోగులు ఎందుకు ఫార్మట్ చేశారో నాకు తెలియదు. దాంతో నాకు ఎలా సంబంధం ఉంటుంది? ఆ తర్వాత మార్చి 21న మూడోసారి ఈడీ ముందు హాజరయ్యాను. అరెస్టైన నిందితులతో కూర్చోబెట్టి విచారించాల్సి ఉందని చెప్పి... అలా చేయలేదు. సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నాకు సమన్లు జారీ చేయబోమని ఏఎస్‌జీ సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చినా... మార్చి 7న వారు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌కు లేఖరాసి కవిత దాఖలుచేసిన రిట్ పిటిషన్‌ను తక్షణం లిస్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈ లేఖ కారణంగానే నేను దాఖలుచేసిన పిటిషన్ మార్చి15న లిస్ట్ చేశారు. కేసును మార్చి 19కి వాయిదా వేసిన వెంటనే ఈడీ అధికారులు వచ్చి అరెస్ట్‌చేశారు. దీన్ని నేను సుప్రీంకోర్టులో సవాల్‌చేశాను. 2023 సెప్టెంబర్‌లో ఈడీ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌లో నన్ను నిందితురాలిగా పేర్కొనలేదు. సెప్టెంబర్ నుంచి మార్చి మధ్యలో కొత్తగా ఏమీ జరగకపోయినా నన్ను అరెస్ట్ చేసి న్యాయప్రక్రియతో ఆడుకుంటున్నారు. కొందరు రాజకీయ నేతలతో చేతులు కలిపి నన్ను పార్టీ మార్చడానికే ఇలా చేశారా? అన్న అనుమానం కలుగుతోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఇద్దరు పిల్లల తల్లిగా నా పరిస్థితిని గమనించి బెయిల్ మంజూరుచేయాలి" అని కవిత తరఫున ఆమె న్యాయవాది విక్రమ్ చౌధరి వివరించారు. మంగళవారం ఈడీ తన వాదనలు వినిపించనుంది.


## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం చేయాలని కేసీఆర్ పార్టీ కార్యకర్తలను, నేతలను కోరారు.

**ముగింపు ఉత్సవాలు ఇలా:** జూన్ 1న సాయంత్రం 7 గంటలకు గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అమర జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో ప్రాణాలఅర్పించిన అమరులకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ రోజున హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన సభ నిర్వహిస్తారు. ఇదే రోజు హైదరాబాద్‌లోని పలు దవాఖానాల్లో, అనాథ శరణాలయాల్లో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తారు. జూన్ 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల్లో ముగింపు వేడుకలు నిర్వహిస్తారు.

# ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి



**హైదరాబాద్:** బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిన మాజీ సీఎం కేసీఆర్‌పై వెంటనే ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసి, మళ్లీ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. 'ఈ విషయంలో వెంటనే కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ప్రాసిక్యూట్ చేయాలి. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యంపై ఏమాత్రం నమ్మకం ఉన్నా దీనిని సీరియస్‌గా తీసుకుని తక్షణమే సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాయాలి. అలాగే ఎమ్మెల్యే పదవికి కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించే అంశంపైనా స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ పక్షాన కోరుతున్నాం'అని... హైదరాబాద్‌లో విడుదల చేసిన ఓ ప్రకటనలో సంజయ్ పేర్కొన్నారు.

### కేసీఆర్‌ను కాపాడటంలో మతలబు ఏమిటి?

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి, వడ్ల స్కాంలో అదే కేసీఆర్‌ను పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాపాడటం వెనుక మతలబు ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. 'ఫోన్ ట్యాపింగ్‌తో ప్రతిపక్షాలపై కేసీఆర్ సైబర్ దాడి.. ఎమర్జెన్సీకంటే దారుణమైన వ్యవహారం. రాధాకిషన్ రావు కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌ను పరిశీలిస్తే ప్రతిపక్షాలపై ముఖ్యంగా బీజేపీపై దాడి కోసమే ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించుకున్నట్లు అర్థమవుతోంది" అని ఆరోపించారు. లిక్కర్ కేసులో అడ్డంగా దొరికిన బిడ్డను కాపాడుకునేందుకే కేసీఆర్ గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు అంశాన్ని సృష్టించినట్లు రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్‌తో తేలిపోయిందని బండి విశ్లేషించారు.

### కేటీఆర్ అండ్ కో పైనా అనర్హత వేటు వేయాలి

'ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీ సహా ప్రతిపక్ష పార్టీల నేతలను భయపెట్టేందుకు ఫోన్ ట్యాపింగ్ చేయడం ముమ్మాటికీ రాజ్యాంగ ద్రోహమే. ఇలాంటివారు ఎమ్మెల్యేగానే కాదు.. భవిష్యత్తులో రాజ్యాంగబద్ధంగా ఏ పదవి చేపట్టడానికి కూడా అర్హులు కాదు.. అందువల్ల కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ట్యాపింగ్‌తో సంబంధమున్న బీఆర్ఎస్ నేతలపై అనర్హత వేటు వేయాలి"అని బండి డిమాండ్ చేశారు. ఇందులో భాగం పంచుకున్నందున అవసరమైతే బీఆర్ఎస్ పార్టీ గుర్తింపును సైతం రద్దు చేసే అంశంపై ఆలోచించాలని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ దేశ భద్రత అంశం

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ అనేది దేశ భద్రతకు సంబంధించిన అంశమని, దీన్ని ఇతర స్వార్థ ప్రయోజనాల కోసం వాడిన వారెవరైనా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన డీజీపీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ అంశంపై పోలీస్ దర్యాప్తు కొనసాగుతున్నందున ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా, ఇటీవల వనపర్తి జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ప్రవీణ్ కుమార్ బృందం సోమవారం డీజీపీ రవి గుప్తాకు విజ్ఞప్తి చేసింది. హత్య జరిగి నాలుగు రోజులవు తున్నా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి మంత్రి జూపల్లి కృష్ణారావుపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటి వరకు ఈ కేసులో నిందితులెవరినీ అరెస్ట్ చేయలేదని డీజీపీ దృష్టికి తెచ్చారు. శ్రీధర్ రెడ్డి హత్యపై ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డీజీపీని కోరామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారం రోజుల్లో తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



# అసమ్మతి, ప్రతిపక్ష నేతలపై అక్రమ నిఘా!

(మొదటి పేజీ తరువాయి)

ఇరుకున పెట్టాలని నిర్ణయించుకున్న కేసీఆర్ ఈ విషయాన్ని ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావులకు అప్పగించడంతోపాటు వారికి సహకరించాలని రోహిత్‌రెడ్డిని ఆదేశించారు. డీఎస్పీ ప్రణీత్‌రావు ద్వారా కొందరు ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టడం ద్వారా కీలక విషయాలు రాబట్టారు. ఈ ఆడియో క్లిప్స్‌ను కేసీఆర్‌కు అందించారు. వీటి ఆధారంగా మొయినాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో ఉన్న రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ప్రత్యేక ఆపరేషన్‌కు ప్లాన్ చేశారు. ఫలానా రోజున అక్కడికి రావాలని రోహిత్‌రెడ్డి ద్వారా నందుతోపాటు ఇద్దరు స్వామీజీలకు సందేశం పంపారు. అప్పట్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌లను రాధాకిషన్‌రావు ఢిల్లీకి పంపి ప్రత్యేక స్పై కెమెరాలు ఖరీదు చేయించారు. వీటిని శ్రీకాంత్‌తోపాటు మరో ఇద్దరు ఎస్సైలు మల్లికార్జున్, అశోక్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో బిగించారు. రోహిత్‌రెడ్డితోపాటు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన మరో ముగ్గురు ఎమ్మెల్యేలను స్వయంగా కేసీఆర్ రంగంలోకి దింపారు. క్షేత్రస్థాయిలో సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఆపై ఏర్పాటైన సిట్ ద్వారా ఆర్ఎస్ఎస్ కీలక నేత బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేయించాలని తద్వారా బీజేపీని దారిలోకి తెచ్చుకుని తన కుమార్తె, ఎమ్మెల్సీ కవితపై ఉన్న ఈడీ కేసు నీరుగారేలా చేయాలని భావించారు. కొందరు సైబరాబాద్ పోలీసుల అసమర్థత కారణంగా కేరళలోని మాతా అమృతానందమయి ఆశ్రమానికి చెందిన ఒక ముఖ్యమైన వ్యక్తి తప్పించుకున్నాడు. దీంతో ఆయన్ను పట్టుకోవడానికి ఎస్పీ రెమా రాజేశ్వరి, ఇన్‌స్పెక్టర్ బి.గట్టుమల్లుతో కూడిన బృందాన్ని ఏకంగా చార్టర్డ్ ఫ్లైట్‌లో అక్కడకు పంపించారు. ఈ ప్రయత్నమూ సఫలీకృతం కాకపోవడంతోపాటు ఆయా నిందితులను అరెస్టు చేయొద్దని, కేసును సీబీఐకి అప్పగించాలని న్యాయస్థానం నుంచి ఆదేశాలు రావడంతో అంతా అసంతృప్తి చెందారు. తాను అనుకున్నది జరగకపోవడంపై కేసీఆర్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు.

### ఇబ్బందికరంగా ఉన్న పరిణామాలను గుర్తించి...

ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు మధ్య తరచూ వివిధ నియోజకవర్గాల్లోని రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిగేవి. బీఆర్ఎస్‌తోపాటు దాని నాయకులకు ఇబ్బందికరంగా ఉన్న పరిణామాలను వీళ్లు గుర్తించే వాళ్లు. ఈ సమాచారాన్ని ప్రణీత్‌కు పంపి ఆయా వ్యక్తులపై నిఘా పెట్టమని ఆదేశించే వాళ్లు. ఇలా ఎస్ఐబీ నిఘా ఉంచిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లూ ఉండటం గమనార్హం. నాటి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో విభేదించిన అప్పటి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, అప్పట్లో కడియం శ్రీహరితో విభేదాలు ఉన్న మాజీ మంత్రి టి.రాజయ్య, తాండూరు ఎమ్మెల్యేపై అసంతృప్తిగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి దంపతులతోపాటు మాజీ ఐపీఎస్ అధికారి, నాటి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, రెండు మీడియా సంస్థల అధినేతలు, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కుమారుడు రఘువీర్, గద్వాలకు చెందిన సరిత తిరుపతయ్య, కోరుట్ల వాసి జువ్వాడి నర్సింగరావు, అచ్చంపేటకు చెందిన వంశీకృష్ణ, మానకొండూరుకు చెందిన కవ్వంపల్లి సత్యనారాయణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల ఫోన్లు ట్యాప్ చేశారు. వీరితోపాటు వివిధ నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన యజమానులు, వ్యాపారవేత్తల ఫోన్ల పైనా అక్రమ నిఘా ఉంచారు.

### ఫోన్ కాల్స్‌కు దూరంగా ఉన్న వారిపై..

ఎస్ఐబీ నిఘా ఉంటుందన్న భయంతో అప్పట్లో అనేక మంది రాజకీయ నాయకులు, న్యాయాధికారులు, ప్రభుత్వ అధికారులు ఫోన్ కాల్స్‌కు దూరంగా ఉన్నారు. వీళ్లు ఎక్కువగా సిగ్నల్, స్నాప్‌చాట్ తదితర సోషల్ మీడియాను వినియోగిస్తూ ఎరీన్‌క్రిప్టెడ్ విధానంలో మాట్లాడటం ప్రారంభించారు. దీన్ని గుర్తించిన ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు.. వారు ఎవరితో మాట్లాడారో గుర్తించడానికి వారి ఐపీడీఆర్‌లు (ఇంటర్నెట్ ప్రోటోకాల్ డేటా రికార్డ్స్) సేకరించి, విశ్లేషించారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు అక్టోబర్%–%నవంబర్‌ల్లో ట్యాపింగ్ మరింత పెరిగింది. నాటి మంత్రి టి.హరీశ్‌రావు సిఫార్సుతో ఐన్యూస్ సంస్థ అధినేత శ్రావణ్ కుమార్ ప్రభాకర్‌రావుతో సన్నిహితంగా మెలిగారు. అనేక సందర్భాల్లో ఆయన వాట్సాప్ ద్వారా ప్రణీత్‌రావుతో టచ్‌లో ఉన్నారు. అలా కాంగ్రెస్, బీజేపీ నాయకులు, వారి మద్దతుదారుల వివరాలు సేకరించి అందించే వారు. ప్రత్యర్థి నాయకులను లక్ష్యంగా చేసుకుని వారి నగదును స్వాధీనం చేసుకోవడానికి, టార్గెట్ చేసిన వ్యక్తులను ట్రోల్ చేయడానికి శ్రావణ్ పూర్తి సహాయ సహకారాలు అందించారు. తాను 2020లో పదవీ విరమణ చేసిన తర్వాత రెండుసార్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా పెద్దాయన (కేసీఆర్) అవకాశం ఇచ్చారని, ఈ విశ్వాసంతో కొన్ని కేసులకు అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు బయటపెట్టనని రాధాకిషన్‌రావు వాంగ్మూలంలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ 72.37%

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. నల్లగొండ సమీపంలోని దుప్పపల్లి వేర్ హౌజింగ్ గోదాముల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో బ్యాలెట్ బాక్సులను భద్రపరుస్తున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 605 పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులన్నింటినీ నల్లగొండకు తరలించే ప్రక్రియ సోమవారం అర్ధరాత్రి తరువాత కూడా కొనసాగింది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

### నార్కట్‌పల్లిలో స్వతంత్ర అభ్యర్థి ధర్నా

పోలింగ్ సందర్భంగా నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు చేసుకున్నామని చెబుతున్న దోకూరి ఫంక్షన్ హాల్ వద్దకు స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ తన అనుచరులతో అక్కడికి వెళ్లారు. కాంగ్రెస్ కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా అశోక్ అనుచరులు వీడియో తీస్తుండగా తోపులాట జరిగింది. దీంతో తనపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారని నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. కాగా, నకిరేకల్‌లోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రంలో ఓ వికలాంగురాలు తనకు ఓటు వేసేందుకు వీల్ చైర్ అందుబాటులో పెట్టలేదని నిరసన తెలిపారు.

### ప్రశాంతంగా పోలింగ్ : రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. ఉదయం కొంత మందకొడిగా ప్రారంభమైనప్పటికీ ఆ తర్వాత ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటేశారన్నారు. ప్రత్యేకించి మహిళలు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల వరకు అత్యధికంగా ములుగు జిల్లాలో 74.54 శాతం, అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 65.54 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు.

## కూటమి అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీ

### పంజాబ్ ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశంలోని రైతులందరికీ రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్నివీర్ పథకాన్ని కూడా రద్దు చేస్తామని చెప్పారు. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కోటక్‌పుర అసెంబ్లీ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన పలు సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల కోసం కమిషన్ ఏర్పాటు చేస్తామని, రైతు రుణమాఫీ అవసరమైనప్పుడు ఈ కమిషన్ సిఫారసు చేస్తుందని, ఆ సిఫారసులను తాము అమలు చేస్తామని చెప్పారు. భారత సైనికులను కార్మికులుగా మార్చి ఆ వర్గంలో పేద, సంపన్న వర్గాలను సష్టించిన ఘనత మోదీకే దక్కుతుందని విమర్శించారు. దేశంలో పెరిగిపోయిన ద్రవ్యోల్బణం, అవినీతిలకు తగిన మూల్యాన్ని మోదీ చెల్లించుకుంటారని ఆయన అన్నారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణ చూసి మోదీ తీవ్ర ఆందోళన చెందుతున్నారని, అందుకే విపక్షాలపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మోదీ తన ప్రధాని స్థాయిని దిగజార్చేలా మాట్లాడుతున్నారని, ఆయన ఓటమికి ఇదే నిదర్శనమని భట్టి వ్యాఖ్యానించారు.

## దేశానికి మీరేం చేశారో చెప్పుకునే దమ్ముందా?: జగ్గారెడ్డి

**హైదరాబాద్:** దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివద్ధి మినహా మిగిలిన పార్టీలు ఈ దేశానికి ఏం చేశాయో చెప్పుకునే దమ్ముందా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి సవాల్ విసిరారు. స్వా తంత్ర్యం వచ్చిన తర్వాత 60ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయకుండానే బీజేపీ, బీఆర్ఎస్ వచ్చి ఈ అభివద్ధినంతా చేశాయా అని ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు మెట్టు సాయికుమార్, చరణ్‌కౌశిక్‌యాదవ్, గజ్జి భాస్కర్, భవానీరెడ్డితో కలిసి జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశానికి కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాజెక్టులు కట్టలేదని చెప్పగలరా అని నిలదీశారు.

నెహ్రూ దూరదష్టితో ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుదుత్పత్తికి ప్రాధాన్యతనిచ్చారని వివరించారు. నెహ్రూ కట్టిన ప్రాజెక్టుల ద్వారా వచ్చిన నీళ్లను మోదీ తాగలేదా? కాంగ్రెస్ హయాంలో కట్టిన మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నీటిని కిషన్‌రెడ్డి, కేసీఆర్‌లు తాగలేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుతెచ్చింది కాంగ్రెస్ అయితే, అమ్మకానికి పెట్టింది మోదీనని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
హైదరాబాద్
మంగళవారం, 28 మే, 2024



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న,బోనగిరి శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి టి పి సి సి డెలిగేట్ మెంబర్ తంగేళ్లపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి) :- నల్గొండ,వరంగల్, ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా యాదగిరిగుట్టలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తదితరుల దృశ్యం.

## బీరప్ప కామరాతి కళ్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):-** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామరం మండల కేంద్రంలో బీరప్ప కామరాతి దేవి కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో మల్లన్న స్వామి,బీరప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ నిర్వాహకులు కుల బంధువులు సన్మానించారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామి అమ్మవార్లను బీర్ల ఐలయ్య వేడుకున్నారు.

## తీన్మార్ మల్లన్న కి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### అనంతరం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించిన బీర్ల ఐలయ్య



**భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):** వరంగల్,ఖమ్మం,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తుర్కపల్లి మండల కేంద్రంలో ఓటు వేసి యాదగిరిగుట్ట పోలింగ్ కేంద్రం వద్ద ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వక కలసిన ఎమ్మెల్సీఅభ్యర్థి తీన్మార్ మల్లన్న. ఎమ్మెల్సీగా మంచి మెజార్టీతో గెలుస్తున్నారని బీర్ల ఐలయ్య తీన్మార్ మల్లన్నకు తెలిపారు. పట్టభద్రులందరూ తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం బీర్ల ఐలయ్య అలేరు..రాజపేట పోలింగ్ స్టేషన్స్ ను సందర్శించడం జరిగింది.

## ప్రభుత్వ భూమిని దౌర్జనంగా ఆక్రమించిన వ్యక్తికి రిమాండ్..



**జూబ్లీహిల్స్ 27 మే (వాయిస్ టుడే):** బోరబండ పరిధిలోని యూసుఫ్ గూడ సర్కిల్ 19 లో సారథి సొసైటీ లో ఉన్న ప్రభుత్వ భూమిలోకి షేక్ జావిద్ అనే వ్యక్తి దౌర్జన్యంగా చొరబడి ప్రభుత్వ స్థలాన్ని కాజేసినందుకుగాను వెస్ట్ జోన్ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు..నిందతుడని కోటలో హాజరపరచగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది కోర్టు. ఈ సందర్భంగా పోలీసులు కొన్ని ప్రజలకు సూచనలు చేశారు ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన లేదా దౌర్జన్యాలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు

# ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

### ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి

### ఉప్పల్లోని ఆయా డివిజన్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఒకవైపు కొత్త పనులకు నిధుల మంజూరు తో పాటు పాత పనులను వేగంగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం లో జరుగుతున్న పలు రకాల అభివృద్ధి పనుల తీరుపై సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూసుకోవాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డికి ఈ సందర్భంగా అధికారులకుసూచించడం జరిగింది.ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ లో రూ.27 కోట్లతో మంచి నీటి సరఫరా, ఇతర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.చిల్కానగర్ డివిజన్ లో చిల్కానగర్ బోడుప్పల్ సరిహద్దు కాలనీలలో మురుగు సమస్య పరిష్కారానికి రూ.1.50 కోట్లతో పనులు,ఉప్పల్ డివిజన్ లోని సెవెన్ హిల్స్ కాలనీ, పద్మావతి కాలనీ ,ఆనందనగర్, శ్రీ శ్రీ నగర్ కాలనీ ,గణేష్ నగర్, తదితర కాలనీ లో రూ.3.98 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు జగనన్నట్లు ఆయన పేర్కొన్నారు.

## షెడ్డు కూలిన ఘటనలో బాలుడు మృతి చెందడం బాధాకరం: ఎమ్మెల్యే అరికపూడి



**శేరిలింగంపల్లిబీ మే 27(వాయిస్ టుడే):** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ లో నిన్న కురిసిన భారీ వర్షానికి రేకుల షెడ్డు కూలిన ఘటనలో సమద్ అనే మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటనలో సోమవారం మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి, రూ.లక్ష లు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆమేరకు రషీద్ పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కేటీఆర్, ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రమాదవ శాత్తు నిన్న జరిగిన ఘటన చాలా దురదృష్టకరమని, బాలుడి మృతి మమ్మల్ని ఎంతగానో కలిచివేసిందని అన్నారు. బాలుడి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులకు తాము ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి అన్ని విధాల అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడిని సురక్షితంగా తల్లి వద్దకు చేర్చిన పోలీసులు



**జూబ్లీహిల్స్ 27 మే( వాయిస్ టుడే):**బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు సంవత్సరాల వయసుగల ఫర్హాన్ ఆడుకుంటూ దారి తప్పి పోయాడు తల్లిదండ్రులు చుట్టుపక్కల కాలనీవాసుల దగ్గర వెతికిన లాభం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు బోరబండ పోలీసులు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గోపాల్ గౌడ్ అడ్మిన్ ఎస్ఐ నాగుల్ మీరా తప్పిపోయిన అబ్బాయిని వెతికి తల్లిదండ్రుల కు అప్పగించారు. . పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

## ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు - రేపటి యువతరానికి సరికొత్త దిక్సూచి



### ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ మండలంలో గత 23 రోజులుగా కొనసాగుతున్న శిక్షణ శిబిరం



**ఇల్లంతకుంట:** ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలతో రేపటి యువతరం సరికొత్త మార్గదర్శకాలై ముందుకు నడుస్తారని ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ప్రతినిధులు అభిప్రాయన్ని వ్యక్తం చేసారు.మండల కేంద్రంలో ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని ఈ నెల 5వ తేదిన ప్రారంభించి 23రోజులకు చేరుకున్నది.వచ్చే నెల జూన్ మొదటి వారం వరకు ఈ శిక్షణ శిబిరం కొనసాగుతుందని నిర్వహకులు తెలిపారు.ప్రతి రోజు శిక్షణ లో ఉదయం , సాయంత్రం శిక్షణకు వచ్చే క్రీడాకారులకు,అరటి పండ్లు , మరియు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించడం జరిగిందని పోలిస్ శాఖ వారు పోలిస్ గ్రౌండ్ ను ఉచిత శిక్షణ శిబిరానికి వారి క్రీడా మైదానంను ఇవ్వడానికి అభ్యంతరం తెలిపి సహకరించక పోయిన వ్యవసాయ మార్కెట్ ప్రక్కన ఓపెన్ ప్లాట్ లలో క్రికెట్ , మరియు ప్రభుత్వ పాఠశాలలలో కబడ్డి , వాలీబాల్ అటలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు అన్నారు.

ఇల్లంతకుంట మండలంలో ప్రతిభ కలిగిన క్రీడా కారులు ఉన్న సరైన ప్రోత్సాహం లేక పోవడంతో ఏవరు కూడ తమ సత్తను నిరుపించుకోలేక పోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేసారు.ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ వారు ప్రభుత్వ సహయంతో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించడం జరిగిందని, గతంలో మండలం నుండి అత్యద్భుతమైన క్రీడా ప్రతిభతో మండలానికి మంచి గుర్తింపు తెచ్చారాని స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు మామిడి రాజు తెలిపారు. శిక్షణలో పాల్గొనే క్రీడాకారులకు డ్రెస్ కోడ్, శిక్షణ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

## బీరన్న బోనమెత్తిన వోడితల ప్రణవ్ సల్లంగా చూడాలని బీరన్నకు మొక్కులు



**ఇల్లందకుంట మే 27(వాయిస్ టుడే):** సల్లంగా చూడు బీరన్న అంటూ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ బోనం ఎత్తుకొని మొక్కులు చెల్లించుకున్నారు.ఇల్లందకుంట మండలంలోని మల్యాల, లక్ష్మాజపల్లి గ్రామాలలో బీరన్న ఉత్సవాలలో భాగంగా వందలాది మంది మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని డప్పు చప్పుల మధ్య నృత్యాలు చేస్తూ బీరన్నకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రణవ్ బాబు కు స్థానికులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కులదేవతల పండుగలు జరుపుకోవడం ఆన వాయితీగా వస్తున్న ఆచారం అని, గ్రామ దేవతలను పూజించడం వల్ల గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండటంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా ఉండి ఆయురారోగ్యాలతో ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గ్రామ దేవతల ఉత్సవాలు జరపడం మంచి సాంప్రదాయమని పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్ వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## భూ భకాసురులనుండి కాపాడే వారే లేరా.. ఏదేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జాలు: జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు



**జమ్మికుంట మే 27(వాయిస్ టుడే):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారంలోని సర్వే నెం. 368 కుంట శిఖం భూమి 0-33 గుంటలు కబ్జాదారుల బారి నుండి కాపాడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి జమ్మికుంట మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ బొంగోని వీరన్న ఫిర్యాదు చేశారు.ధర్మారం గ్రామంలోని సర్వే నెం 368 లో 0-33 గుంటల కుంట శిఖం భుమి ఉండగా మధ్యలో నుండి 1965లో ఆర్‌బి రోడ్డు జమ్మికుంట నుండి వావిలాల వరకు పోయింది.అప్పటి నుండి ఆ కుంట ఖాళీగా బొందలుగా ఉండేది.ఈ భూమిని ఆనుకొని ఉన్న భూమిలో అనాధికారంగా లే అవుట్ లు పర్మిషన్ లేకుండా గజం భూమిని రూ 20 వేల చొప్పున గుంటకు రూ 24 లక్షలకు అమ్ముతున్నారు. ఈ భూములు అమ్మినవారి ప్రక్కనే ఉన్నా 0-33 గుంటల శిఖం భూమిపై కన్ను పడి ఎవరికి వారి చదును చేసుకుంటు భూమి హద్దులు చేరిపివేస్తు ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. కొందరు వ్యక్తులు ఈనెల 25వ తేదీన టిప్పర్లతో మొరం పోసి భూమిని చదును చేశారు.ఈ ప్రభుత్వ శిఖం భూమికి బహిరంగ మార్కెట్లో రూ 8 కోట్ల రూపాయలు వరకు ఉంటుందని పేర్కొన్నారు.ఈ ప్రభుత్వ భూమిలో మొరం పోసేటప్పుడు జమ్మికుంట తాసిల్దార్ కు సమాచారం ఇచ్చిన పట్టించుకోలేదని పేర్కొన్నారు.ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరు ప్రక్కల ఉన్న (ప్రభుత్వ శిఖం భూమి) సర్వే నంబర్ 0-33 గుంటలకు హద్దులు పెట్టి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఆయన కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

## ఫోన్ టాపింగ్ కు పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదు - డా.కవ్వంపల్లి సత్యనారాయణ




**కరీంనగర్ టౌన్, మే 27 ( వాయిస్ టుడే):** గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ఫోన్ టాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడైన మాజీ డిజిపి రాధాకిసాన్ రావు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపిన వివరాల ప్రకారం నా ఫోన్ టాపింగ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను అని మనకొండూర్ ఎంఎల్ఏ డా కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తాను.కెసిఆర్ కుటుంబ సభ్యులలో ఒకరైన హరీష్ రావు ఆదేశాల మేరకే ఫోన్ టాపింగ్ చేయడం జరిగిందని రాధా కిషన్ రావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సంతోష్ రావు మరియు ఈ వ్యవహారంలో బాధ్యులైన ప్రతి ఒక్కరికి నోటీసులు అందజేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వానికి విన్నవించడం జరుగుతుంది. వీరందరిపై విచారణ జరిపించి దోషులను ప్రజాక్షేత్రం నుండి వెలివేయాలని, గతంలో ఫోన్ టాపింగ్ వల్ల ప్రభుత్వాలు కూలిపోయిన సందర్భాలు ఉన్నాయని ఇప్పుడు కేవలం రాజకీయ రంగంలోనే కాక సినీ ప్రముఖులు మరియు కొంతమంది వ్యాపారవేత్తల ఫోన్లను కూడా టాపింగ్ చేసి ఈ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వారి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పనిచేసిన వారందరినీ బ్లాక్ మెయిల్ చేయడం బెదిరింపులకు పాల్పడడం ద్వారా ఒక నిరంకుశ నియంతృత్వ పాలనను కొనసాగించిన కేసీఆర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరని ఇక త్వరలోనే ఆ పార్టీని భూస్థాపితం చేసేందుకు ప్రజలు వేచి చూస్తున్నారని తెలియజేస్తున్నాను. ఈ వ్యవహారంలో భాగస్వాములైన బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులను, అధికారులను తక్షణమే వారి బాధ్యతల నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఇంచార్జీ జువ్వాడి నరసింగరావు, కరీంనగర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్



**వరంగల్ : మే 27 (వాయిస్ టుడే):** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. 605 పోలింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేయగా.... వారి వారి పోలింగ్ బూత్ లలో ఓటు హక్కును గ్రాడ్యుయేట్లు వినియోగించుకున్నారు. 52 మంది అభ్యర్థులు భవితవ్యాన్ని ఓటర్లు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. జూన్ 5న ఫలితా లను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. అయితే ఒక చోట మినహా పోలింగ్ అంతా ప్రశాంతంగా ముగిసింది.

## పట్టభద్రుల ఓటు ను వినియోగించుకొన్న మాజీ కార్పొరేటర్: శమంతుల ఉషశ్రీనివాస్ దంపతులు



**వరంగల్ మే 27 వాయిస్ టుడే:** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఉపఎన్నిక లో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్, 34 డివిజన్, ప్రభుత్వ హై స్కూల్, 128వ బూత్ లో 34, వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు శమంతుల ఉష శ్రీనివాస్ దంపతులు సోమవారం నాడు తమ ఓటు హక్కు ను ఉపయోగించుకొన్నారు. ఓటు వేసిన, అనంతరం తెలంగాణ శాసన మండలిలో ప్రశ్నించే గొంతుకై, ప్రతి ఒక్క పట్టభద్ర ఓటరు తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకొని భారత ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేయాలని జిల్లా పట్టభద్రులకు పిలుపునిచ్చినారు.

## ప్రభాకర్ మృతి కి సంతాపం తెలిపిన రాష్ట్ర పోపా అధ్యక్షుడు శ్రీనివాస్



**తొర్రూర్ మే 27 (వాయిస్ టుడే):** ప్రముఖ విద్యవత్త, సామాజిక సేవకుడు కాలేజ్ ప్రిన్సిపాల్, తొర్రర్ పోపా మండల అధ్యక్షులు రాపోలు ప్రభాకర్ (62) సోమవారం అకాల మరణం చెందడం జరిగింది. ఆయన మరణం పట్ల పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల విచారం వ్యక్తం చేస్తూ రాపోలు ప్రభాకర్ అకాల మరణం చాలా భాధ కారమని పద్మశాలి ల అభ్యునతికి పోపా కు అయన సేవలు చేశారాని అన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ మాటేటి అశోక్, ధర్మపురి రాజగోవింద్, గోషికొండ సుధాకర్ తో పాటు పోపా ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు గుండు కామేశ్వర్, పాము శ్రీనివాస్, మేరుగు సుభాష్, చెన్నూరి రమేష్, మాటేటి సంతోష్, మండల నాయకులు, పద్మశాలి కుల బంధువులు, వివిధ పార్టీ నేతలు వారికీ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ప్రశాంతంగా జరిగిన ఎంఎల్సి ఎన్నికల పోలింగ్





**తొర్రూర్ మే 27 వాయిస్ టూడే:** తొర్రూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రం లోని జడ్ పిహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణ లో జరిగిన ఎంఎల్ సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.ఓటర్ల సౌలభ్యం కొరకు నాలుగు బూత్ లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో బూతు నెంబర్ 170 లో మొత్తం వెయ్యి ఇరవై మూడు ఓట్లు ఉండ గా పోలైన ఓట్లు 768 కాగా ఇందులో పురుషుల ఓట్లు 446,స్త్రీల ఓట్లు 322,బూత్ నెంబర్ 171,మొత్తం ఓటర్లు 1,162 ఉండ గా పోలైన ఓట్లు 876 నమోదు కాగా పురుషుల ఓట్లు 504, స్త్రీల ఓట్లు 372 నమోదు కాగా బూతు నెంబర్ 172 లో మొత్తం ఓటర్లు 1173 ఉండ గా పోలైన ఓట్లు 886 ఇందులో పురుషుల ఓట్లు 561,స్త్రీల ఓట్లు 325 నమోదు కాగా,బూత్ నెంబర్ 173 లో మొత్తం ఓటర్లు 1,069 ఉండ గా ఇందులో పోలైన ఓట్లు 804 కాగా పురుషుల ఓట్లు 489, స్త్రీల ఓట్లు 315 నమోదయ్యాయి.నాలుగు బూతుల కు కలిపి మొత్తం ఓటర్లు 4,427 ఉండగా ఇందులో పోలైన మొత్తం ఓట్లు 3,334 పోలయ్యాయి. మొత్తం పోలైన శాతం 75.3% నమోదయ్యాయి.పెద్దవంగర మండల కేంద్రం లో బూత్ నెంబర్ 169 ని ఏర్పాటు చేయ గా మొత్తము ఓటర్లు 1,348 ఉండ గా పోలైన ఓట్లు 1,000 కాగా,ఇందులో పురుషుల ఓట్లు 662,స్త్రీల ఓట్లు 338 నమోదయ్యాయి.కొడకండ్ల మండల కేంద్రంలో, బూత్ నంబర్ 32 ను ఏర్పాటు చేయ గా మొత్తము ఓటర్లు 1315, ఉండగా పోలైన ఓట్లు 929, ఇందులో పురుషుల ఓట్లు 639, స్త్రీల-ఓట్లు, 290 నమోదయ్యాయి.

# వైభవంగా శ్రీ వేంకటేశ్వరుడి రథోత్సవం

### రాష్ట్ర నలుమూలల నుండి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు.. ముగిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు...



**చిగురుమామిడి (వాయిస్ టుడే):** మొక్కిన మొక్కులు వెంటనే తీర్చే స్వామివారిగా ప్రసిద్ధిగాంచిన కరీం నగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు రథోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఆలయ అధికారులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 4గంటల నుండి స్వామివారికి అర్చకులు శేషం సత్యనారాయణ చార్యులు, శేషం శ్రీనివాసచార్యులు,శేషం సుధీర్ చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై డప్పు చప్పుల్ల మధ్య పురవీధుల గుండా ఊరేగించారు. రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గొడ్డు గోదా సల్లంగా ఉండాలని స్వామివారికి మొక్కులు చెల్లించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, శకటోత్సవం,రథోత్సవ కార్యక్రమాలతోపాటు ఆలయం ముందు సంస్కృతిక కార్యక్రమాలను భక్తులను ఎంతగానో అక్కట్టున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు,చలువ పందిళ్ళు, వైద్యంతోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు.రథోత్సవం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొండపర్తి రాజ్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,ఆలయ చైర్మన్ గందే సంపత్,ఆలయజూనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీసర్పంచ్ శ్రీమూర్తి రమేష్, పెసరి రాధాకృష్ణ, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తున్న గ్రామీణ వైద్యులపై దాడులు మానుకోవాలి

### ఆర్ఎంపి,పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనపురపు వెంకన్న



**తొర్రూర్ మే-27 వాయిస్ టూడే:** ప్రభుత్వ నిబంధనల ను అనుసరిస్తూ ప్రథమ చికిత్స చేసు కుంటున్న గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాల పై దాడులు మాను కోవాలని ఆర్ఎంపి పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపురపు వెంకన్న గౌడ్,తొర్రూర్ మండల గౌరవ అధ్యక్షుడు సింగారపు భీమయ్య లు డిమాండ్ చేశారు.ఆదివారం తొర్రూర్ డివిజన్ కేంద్రం లో ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూర్ మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు ధర్మారపు హనుమంతు ఆధ్వర్యం లో నిర్వహించిన సమావేశాని కి ముఖ్య అతిథులు గా హాజరైన అనపురపు వెంకన్నగౌడ్, సింగారపు భీమయ్య లు మాట్లాడుతూ.,ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రథమ చికిత్స చేసుకుంటున్న గ్రామీణ వైద్యుల ను భయ భ్రాంతుల కు గురి చేస్తూ దాడులు నిర్వహించడం సరి కాదని గ్రామీణ వైద్యులు లేకుండా గ్రామాల లో ప్రజలు జీవించడం కష్టమని చిన్న,చిన్న వైద్యం కోసం వెయ్యిరూపాయలు వెచ్చించి ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రుల లో వైద్యం చేయించు కోలేకనే మా దగ్గరి కి వచ్చి ప్రథమ చికిత్స చేయించు కుంటున్నారని అలాంటి పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ను దోపిడీ చేయడమే లక్ష్యం గా కార్పొరేటు ఆసుపత్రు లు చూస్తున్నాయని వారు విమర్శించారు.దీంతోనే గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు నిర్వహించేందుకు కార్పొరేట్ ఆసుపత్రి లో యాజమాన్య రుద్రం తోనే దాడులు నిర్వహిస్తున్నారని తెలియ చేశారు.గ్రామీణ ప్రాంతాల లో వెయ్యి మం దికి ఒక ప్రభుత్వ వైద్యుని నియమిస్తే మేము స్వచ్ఛందం గా ప్రథమ చికిత్స చేయడం మాను కుంటామని,నిబంధనల ప్రకారం ప్రథమ చికిత్స చేయాలని చెపుతున్న ప్రభుత్వం ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల లో వెయ్యి మంది కి ఒక ప్రభుత్వ వైద్యుని.నియమించే సత్తా ప్రభుత్వం దగ్గర ఉందా అని సవాల్ విసిరారు.వెయ్యి మంది కి ఒక ప్రభుత్వ వైద్యున్ని నియమిస్తే., గ్రామీణ వైద్యులందరు స్వచ్ఛందం గా ప్రథమ చికిత్స చేయడం మానుకుంటామని సవాల్ విసిరారు.గ్రామీణ ప్రాంతాల లో గ్రామీణ వైద్యుల ను భయ భ్రాంతుల కు గురి చేసి పేద మధ్య తరగతి ప్రజల నుండి కార్పోరేట్ ఆసుపత్రు లు దోపిడీ చేసేందుకే ఈ దాడులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెయ్యి మంది కి ఒక ప్రభుత్వ వైద్యున్ని నియమించాలని లేని యెడల సంఘం ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్తం గా ఆందోళన పోరాటాలు నిర్వహించడాని కి వెనుకాడ పోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమం లో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నెం వెంకన్న,సీనియర్ గ్రామీణ వైద్యుడు కడియం విశ్వనాథం, మండల కమిటీ సభ్యులు, గడ్డం.రాజమౌళి, బిక్షపతి, ధర్మారపు. ఐలయ్య, గద్దల.వెంకటేష్, పెద్ది.అనిల్, కొమ్మనబోయిన.యాకయ్య, వెనమాల.రవి, సందీప్, మనోహర్, తదితరులు, పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం.. అక్రమ ఇసుక రవాణా

### ప్రభుత్వ ఆదాయానికి గండి



**వాయిస్ టుడేన్యూస్ చింతలపాలెం ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం చింతలపాలెం మండలం పులిచింతల బ్యాక్ వాటర్ నందు పులిచింతల పరివాహ ప్రాంతమైన చిత్రియల రేబల్లె గ్రామ పరిధిలో గల నది పరివాహ ప్రాంతం కావడం వల్ల బ్యాక్ వాటర్ లేకపోవడం ఇసుక మాఫియా రాయులకు కలిసొచ్చిందని చెప్పవచ్చు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా. సాగిపోతుంది ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకున్నామని అక్కడి గ్రామ ప్రజలను నమ్మబలికి ఇష్టారాజ్యంగా ఇసుక మాఫియా. ఇసుక అక్రమ రవాణా కట్టడిలోకి రావడం లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు నేతలు ఇష్టారీతిన ఇసుకను తోడుస్తున్నారు. హుజూర్నగర్ నియోజకవర్గానికి అక్రమ ఇసుక తరలింపు జోరుగ కొనసాగుతుంది. చింతలపాలెం మండలంలో కృష్ణా నది పరివాహ ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేపడుతున్నారు. కానీ అటు వైపుగా రెవెన్యూ శాఖ గాని, పోలీసు అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమాదారులు తమదైన శైలిలో అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. దీనికి తోడు అధికారులకు ఆమ్యామ్యాలు అందుతుండడంతో వీరి వ్యాపారం. మూడు ట్రాక్టర్లు ఆరుటిప్పర్లులుగా. సాగుతుంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది ప్రస్తుతం అనుమతులు లేకుండానే అధికారులకు మాముళ్లు అందజేస్తూ తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ తంతు అంతా అధికారులకు తెలిసే జరుగుతుందని అనుమానాలకు తావిస్తోంది. రాత్రి వేళల్లో ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ స్థానిక పోలీసులు ఇసుక ట్రిప్పర్లను ఆపి ప్రశ్నించి అడగ్గా ట్రిప్పర్ డ్రైవర్లు చరవాణిలో మాట్లాడివ్వడంతో పోలీసులు ఆ వాహనాలను వదిలిపెడుతున్నారు. ఆ చరవానిలో మాట్లాడింది ప్రజా ప్రతినిధుల లేక పోలీస్ అధికారుల అనేది తెలియాల్సి ఉంది. అని స్థానికులు తెలుపుతున్నారు. పోలీసుల అక్రమాలను అరికట్టాల్సింది పోయి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న దళారులకు కొమ్ము కాయడంతో దళారులు రెచ్చిపోయి అత్యధిక రేట్లతో విక్రయిస్తున్నారు. ఇసుక రవాణా అధికారుల చేతి వాటం వల్లే ఇదంతా జరుగుతుందని పలువురు జనాలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు వారికి కావాల్సిన ముడుపులు చెల్లడంతో ఈ తంతు మధ్యాహ్నం సమయంలో కూడా యదేచ్ఛగా నడుస్తుందని పలువురు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇసుక దళారులు మాత్రం రాత్రి పగలు అని తేడా లేకుండా ఇష్ట రాజ్యాంగ ఇసుక రవాణా చేపట్టడం శోచనీయమని మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్ ముందు నుండే ఇసుక రవాణా జరుగుతున్న స్థానిక పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వివరించడం గమనార్హం. ప్రభుత్వ ఆదాయాలకు గండి కొడుతూ ప్రభుత్వ అధికారులు జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని లేకపోతే అధికారుల జేబులు నింపుకొని ప్రభుత్వ ఖజానాన్ని గండి కొట్టడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం శూన్యం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఇసుక మాఫియాని అరికట్టడానికి సంబంధిత అధికారులు మామూలు మత్తులో దిగకుండా వారి వృత్తికి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.అంతేకాకుండ చింతలపాలెం మండలం చింత్రియాల నుండి హుజూర్నగర్ కు వెళ్లే రోడ్డు మార్గంలో కూడా రాత్రి సమయంలో టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమంగా సుమారుగా 50 కిలోమీటర్లు తరలిస్తున్న వైన్యం.ఇంత అక్రమ ఇసుక రవాణా తంతు జరుగుతున్న చింతలపాలెం, మేళ్లచెరువు, హుజూర్నగర్ సంబంధిత పోలీసు మరియు రెవెన్యూశాఖ అధికారులకు తెలియకుండా జరుగుతుందా అంటే పప్పులో కాలువేసేనట్లే అని జనాలు ఆరోపిస్తున్నారు. అక్రమాలు జరుగుతే మాకేం, మాములు వస్తే చాలు అనే ధోరణిలో ఉన్నారని చెప్పవచ్చు.

**ఆర్డీవో వివరణ..**

**ఇసుక తోలకము.గురించి మా దృష్టికి రాలేదు. అక్రమంగా ఇసుక తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదు అని ఎవరైనా సరే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.**

## కొత్తగూడెంలో ఓటు హక్కును వినియోగించుకున్న కూనంనేని

### మిత్రపక్షాల అభ్యర్థి మల్లన్న గెలుపు ఖాయం : కూనంనేని




**భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే:** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఉప ఎన్నికలో కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలం బాబు క్యాంపు 271 బూతులో కూనంనేని ఓటు వేశారు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా పట్టణంలోని సింగరేణి మహిళా కళాశాల 277 బూతులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డుతూ తాజా మాజీ ప్రభుత్వ అభ్యర్థి డబ్బు పంపిణీతో గ్రాడ్యుయేట్లను ప్రలోభాలకు గురిచేసి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆరేళ్ళ పదవిని కట్టబెడితే రాజీనామా చేసి ఉప ఎన్నికకు కారణమైన బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అభ్యర్థిని ఎందుకు బరిలో నిలిపిందో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరించే పరిస్థితిలో లేరని, రెండు కోట్ల ఉద్యోగాల హామీతో గద్దెనెక్కి కోటి ఉద్యోగాలు రద్దు చేసిన ఆ పార్టీని ప్రజలు నమ్మరన్నారు. ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ, అవినీతి పాలనను ఎండగడుతున్న మిత్రపక్షాల అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని, మల్లన్న వైపే పట్టభద్రులు అనుకూలంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు మందులను మాత్రమే విక్రయించాలి : వందన

**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 2 2024 (వాయిస్ టుడే):** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని వ్యవసాయ అధికారిని వందన అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేశారు. షాపులలో స్టాక్ రిజిస్టర్, విత్తనాల గడువు తేదీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు, మందులను మాత్రమే విక్రయించాలన్నారు. నాసిరకం మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 1,23,00,000/- రూపాయల విలువ గల 492 కేజీల గంజాయిని పట్టుకున్న కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు

## సినీ ఫక్కీలో నిషేధిత గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 27)** విశ్వసనీయ సమాచారం మేరకు ఈ రోజు కొత్తగూడెం 3టౌన్ ఎస్సై పురుషోత్తం తన సిబ్బందితో కలిసి ఓల్డ్ డిపో రోడ్డు వద్ద వెహికల్ చెకింగ్ చేయుచుండగా సుమారుగా మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు %రూంప్ట్రశీని శ్రీవఎశ్రీఖఅఎ ఖజవీ% వ్యాన్ %వీఎ20జుూ%5732 లో క్యాబిన్ వెనుక భాగానికి సమాంతరంగా అనుమానం కలుగకుండా ప్రత్యేకంగా మరొక అరను తయారుచేసి అందులో ప్రభుత్వ నిషేధిత గంజాయి ప్యాకెట్లను అమర్చి రవాణా చేస్తుండగా వారిని పట్టుకోవడం జరిగింది.వ్యానులో నిషేధిత గంజాయిని గుర్తించిన అనంతరం బయటకు తీసి తూకం వేయగా 492 కేజీలు ఉన్నట్లు తేలింది.దీని విలువ సుమారుగా రూ.1,23,00,000/-(ఒక కోటీ ఇరవై మూడు లక్షలు) ఉంటుంది.జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి 3టౌన్ పోలీసులు ఇట్టి గంజాయిని పట్టుకోవడం జరిగిందని 3టౌన్ సిఐ శివప్రసాద్ వివరాలను వెల్లడించారు. 1).శుభమ్ శరత్ బండారీ, శరత్ లక్ష్మణ్ బండారి,27ఆటో డ్రైవర్, 25,సంస్కృతి కాలనీ,ఘర్సుంగి,పూణే, మహారాష్ట్ర మరియు 2).అంజత్ అబ్దుల్ షేక్, అబ్దుల్ మల్సూర్ షేక్, 36,లారీ డ్రైవర్, ఆలంగర్ ఏరియా,నాగర్ మండల్,అహ్మద్ నగర్ జిల్లా, మహారాష్ట్ర అను ఇద్దరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం,సీలేరు వద్ద పెద్దగొండి గ్రామానికి చెందిన రాజు అను వ్యక్తి వద్ద ఇట్టి గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్ర,షోలాపూర్ కు చెందిన యోగేష్ అనే వ్యక్తి వద్దకు తీసుకెళ్తుండగా ఈరోజు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు పట్టుకోవడం జరిగింది.పట్టుబడిన ఇద్దరు నిందితులకి సోలాపూర్ కి చెందిన యోగేష్ డబ్బులు ఇచ్చి గంజాయిని తీసుకుని రమ్మని చెప్పగా,వీరిరువురు ఇట్టి గంజాయిని వ్యానులో తరలిస్తున్నట్లుగా విచారణలో తేలింది.నిషేధిత గంజాయిని విక్రయించిన రాజు మరియు కొనుగోలు చేయడానికి ప్రయత్నించిన యోగేష్ మరియు రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు.పట్టుబడిన ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించడం జరిగిందని తెలియజేశారు. నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న త్రీ టౌన్ మరియు టాస్క్ ఫోర్స్ పోలీసు అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.




## వేసవిలో చేసే పనుల పై రైతులకు అవగాహన సదస్సు

### డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బీసై ప్రాజెక్ట్ సమన్వయకర్త: పి.దమయంతి..

**సైదాపూర్:(వాయిస్ టుడే)** మండలంలోని గోడిశాల గ్రామంలో రైతులకు డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బీసీ ఐ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ రైతులకు వేసవిలో చేసే పనులపై అవగాహన కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. బీసీఐ సమన్వయకర్త దమయంతి మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి తగ్గి నేల కాలుష్యం తగ్గుతుందన్నారు. రైతులు వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని పశువుల పెంటలు, చెరువు మట్టి వేసుకోవాలని గొర్ల మందలు పెట్టించుకోవాలని పచ్చిరొట్ట, ఎరువులు జీలుగు, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు మొదలైనవి చల్లుకొని కలియదున్నాలని పత్తి, మొక్కజొన్న వ్యర్థాలను కలియధున్నడం వల్ల జీవన ఎరువులు, వర్మి కంపోస్ట్ వేస్ట్ డీకంపోజర్ వాడడం వల్ల భూసారం పెరుగుతుంది అని తెలిపారు.వివిధ పంటలల్లో ఎండ తెగులు నివారణకు ట్రైకో డెర్మవిరిని పశువుల పెంటలో కలుపుకొని తేమ ఉన్నప్పుడు భూమిలో చల్లుకొని కలియదునుకోవాలన్నారు.భూసార పరీక్షల కొరకై రైతులు తీసుకొచ్చిన మట్టిని రైతుల సమక్షంలో పరీక్షలు చేసి రైతులందరికీ పరీక్షల ఫలితాలు వెంటనే ఇచ్చి అన్ని వివరాలు చెప్పారు. పైన చెప్పిన విషయాలును ఆచరిస్తూ తమ ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడాలని రైతులను సూచించారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్.

### పట్టభద్రులు విధిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



**సూర్యాపేట, మే27 (వాయిస్ టుడే ప్రతినిధి)** ఓటు అమూల్యమైనదని పట్టభద్రుల తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరుగుతుందని తెలిపారు. తదుపరి కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్.పి. రాహుల్ హెగ్డే తో కలసి జిల్లాలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. పట్టభద్రులు విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి. సి.ఈ. ఓ అప్పారావు, పి.డి. మధుసూదన్ రాజు, డి.పి.ఓ సురేష్ కుమార్, ఏ.ఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల విభాగం శ్రీనివాస రాజు, తహశీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి కార్యక్రమానికి 6 పిర్యాదులు

### పిర్యాదుదారులతో మాట్లాడి పిర్యాదులు పరిశీలించిన ఎస్పీ




**సూర్యాపేట, మే 27 (వాయిస్ టుడే ప్రతినిధి):** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 6 పిర్యాదు వచ్చినాయి, వివిధ సమస్యల పై బాధితుల నుండి వచ్చిన అర్జిలను , జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణి లో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదుల పై ఆయా పోలీసు స్టేషన్ ల అధికారులతో మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. భార్యాభర్తల తగాదాల వల్ల సమస్యలు పెరిగి కుటుంభం విడిపోతుంది, పిల్లలు మంచి భవిష్యత్తును కోల్పోతారు, సమాజంలో గౌరవం తగ్గుతుంది కావున భార్యాభర్తలు సమస్యలను అధిగమించి మంచి తల్లిదండ్రులుగా ఉండాలని ఎస్పి కోరినారు.

## కూలి రేట్లు పెంచి ఇవ్వాలి యూనియన్ అధ్యక్షుడు : రాజలింగు



**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 27 2024:** (వాయిస్ టుడే) : బెల్లంపల్లి పట్టణంలోని టైలర్స్ వర్కర్స్ కూలీ రేట్లు పెంచాలని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజలింగు డిమాండ్ చేశారు. పట్టణంలో టైలర్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినందున కుటుంబ పోషణ భారమవుతుందన్నారు. టైలర్స్ యజమానులు గతంలో ఇస్తున్న కూలీ రేట్లకు అదనంగా 12% పెంచి ఇవ్వాలని ఆయన కోరారు.

## ప్రజ్ఞాపూర్ హనుమాన్ బృందానికి ముత్యాల తలంబ్రాలను పంపిని చేసిన సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు

### 100 మంది హనుమాన్ స్వాములు పాల్గొన్నారు



**వాయిస్ టుడే మే 28 (సిద్దిపేట జిల్లా ప్రతినిధి)** గజ్వేల్ నియోజకవర్గం ప్రజ్ఞాపూర్ లోని హనుమాన్ భక్త బృందానికి భద్రాచల దేవస్థాన ముత్యాల తలంబ్రాలను సోమవారం నాడు పార్తివేశ్వర స్వామి దేవాలయంలో 100మంది భక్తులకు శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు తలంబ్రాల విశిష్టత తెలియజేసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాశ్వతమైనది చివరికి తోడుండేది రామ నామం ఒక్కటే అన్నాడు. భగవన్నామ స్మరణ వల్లనే మనిషికి మనశాంతి కలుగుతుందన్నారు. భగవంతునికి మించిన సేవ మరొక్కటి లేదన్నాడు. ప్రతి ఒక్కరికి భద్రాచల ముత్యాల తలంబ్రాలను అందజేశారు. రామకోటి సంస్థ సేవను గుర్తించి భద్రాచల దేవస్థానం ఇచ్చిన ముత్యాల తలంబ్రాలను లక్షల మంది భక్తులకు అందజేయాలన్నదే సంస్థ లక్ష్యం అన్నారు. రామకోటి రామరాజు నిర్విరామంగా చేస్తున్న ఆధ్యాత్మిక సేవలకు గాను హనుమాన్ భక్త బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో మెతుకు నర్సింలు, నాగపురి రమేష్, కురుమ ఐలయ్య, వడ్డేపల్లి లక్ష్మన్, పుట్ట కనకయ్య, చెక్కెర రమేష్, హనుమాన్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లలకు విజ్ఞానం అందించడం కోసమే సమ్మర్ గేమ్స్ ఫెస్టివల్

**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 27 2024 (వాయిస్ టుడే):** బెల్లంపల్లి పట్టణం 28వ వార్డ్ లొ ఏకదంతా మిత్రమండలి సభ్యులు బొంతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమ్మర్ గేమ్స్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పిల్లల యొక్క సృజనాత్మకత వెలికి తీసి వారి మేధస్సు పెంచడానికి తోడ్పడే ఆటలైన సైకలాజికల్ గేమ్స్, మెమరీ టెక్నిక్స్ అండ్ మెడిటేషన్, ఎడ్యుకేషనల్ కౌన్సిలింగ్ అండ్ గోల్ సెట్టింగ్, సైన్స్ ప్రాజెక్ట్స్, బేసిక్ ట్రైనింగ్ ఇన్ ఆర్ట్, ఆబ్జెక్టివ్ డ్రాయింగ్, మిర్రర్ ఆర్ట్ అండ్ పెయింటింగ్, క్విజ్, ఇంగ్లీష్ వర్డ్ గేమ్స్, లాంటి ఆటలతో పిల్లలు మానసికంగా, శారీరకంగా దృడంగా ఉండడానికి ఆటల పోటీల తో పిల్లలను ఆలోచింపచేసే విధంగా ఉపయోగపడుతున్నాయి.అదేవిధంగా ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన పిల్లలను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నారు. ఇదేదో స్వంత ప్రయోజనాల కోసమో, వ్యాపారం కోసమో కాదు ఏకదంతా మిత్ర మండలి వారు తమ సొంత ఖర్చుతో పిల్లలకు విజ్ఞానం అందించాలని దృఢమైనా సంకల్పంతో చేసే కార్యక్రమం. అన్ని చోట్లలో విద్యావంతులు ఇదే విధంగా కార్యక్రమాలు చేపట్టినట్లయితే అతిపెద్ద మహమ్మారులైన టీవీ, ఫోన్లకు పిల్లలను ఆకర్షతులు కాకుండా వారిని వాటికీ దూరం పెట్టి సమాజంలొ విజ్ఞానవంతులను చేసే ఆస్కారం ఉంటుందని నిర్వాహకులు బొంతలా శ్రీనివాస్, భోగే ఇంద్ర కుమార్ ముడిమడుగుల స్వామి, భోగె హారిక అంటున్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం



**వాయిస్ టుడే మే 28( సిద్దిపేట జిల్లా):** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గొట్టే కొమరవ్వ కొమురయ్య దంపతులు గత కొద్దిరోజుల క్రితం మరణించినారు అయితే జ్ఞాపకాలు జీర్ణించుకోలేని కుమారులు ఎల్లప్పుడూ ఉండాలని స్మారకర్థం వ్యవసాయ క్షేత్రంలోనే తల్లిదండ్రులకు గుడి నిర్మించడం జరిగింది కుమారులు మాట్లాడుతూ ఈ యొక్క గుడి నిర్మించడం వలన మా తల్లిదండ్రులు ఎప్పుడు మాతోపాటు జీవించి ఉంటారని జ్ఞాపకాలు ఎప్పుడూ ఇక్కడ మాతో పాటు ఉంటాయని ఈ యొక్క దేవాలయం నిర్మించడం జరిగిందని తెలిపారు.

## ప్రభుత్వ భూముల అన్యాకాంతం



**వాయిస్ టుడే మే 28( సిద్దిపేట జిల్లా):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సర్వేయర్ నుసస్పెండ్ చేయాలి హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ భూములకు సంబంధించి కబ్జాలు జరుగుతున్న విషయం గురించి గతరెండు సంవత్సరాల నుండి ఎమ్మార్వో కి ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం ఎమ్మార్వోమరియు సర్వేర్లు మారుతున్నారు కానీ సర్వేనెంబర్ 12 మరియు సర్వే నెంబర్ 921 భూములను కొలిచి ఆ భూములపైచర్యలు తీసుకోవడం లేదు మరియు హద్దులు నిర్ణయించడంలేదు అని అఖిలపక్షా లుకోరిన సర్వేయర్ పట్టించుకోవడంలేదు ఉదాహరణకు సర్వేనెంబర్ 12 లో కోట్ల విలువచేసే ఒక ఎకరం భూమి అన్యాక్రాంతమవుతుంది సర్వేనెంబర్ 921లో ఆరు ఎకరాల 20 గుంటలు భూమి ఉంది అందులో ఒక ఎకరం భూమి కబ్జా అయింది గతంలో 627 సర్వే నెంబర్లు రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఎవరు కొనుగోలు చేయవద్దని అప్పటి ఎమ్మార్వో వాణి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు ఆ బోర్డు ఇప్పుడు కనబడడం లేదు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వ భూములకు కాపలా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు సర్వేయ రూపట్టించుకోవడం లేదు అని బీసీ సంఘాల నాయకుడు పచ్చిమట్లరవీందర్ తెలిపారు.

## సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు : టీఆర్ ఎస్ నేత రావులపల్లి



**(భద్రాచలం, మే 27, వాయిస్ టు డే):** ఖమ్మం నల్గొండ వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలకు ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అభినందనలు తెలిపారు. ఆయన పట్టణం లోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సరళి నీ పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డి నీ గెలిపించాలని కోరారు. గత కొన్ని రోజుల గా అభ్యర్థి విజయం కోసం పనిచేసిన కార్యకర్తలు, నాయకులు, సహకరించిన ప్రజలకు రావులపల్లి రాంప్రసాద్ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకోజు సునీల్ కుమార్, పడిసిరి శ్రీనివాసరావు, కాపుల సూరిబాబు, పట్టాభి, నరసింహులు, రమేష్ , రంజిత్, పూజల లక్ష్మి నాగరాజు , రాణి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తరపున నిరుపేదకు బియ్యం అందజేత



**వాయిస్ టుడే మే 28 ( సిద్దిపేట జిల్లా ):** హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ గుడి దగ్గర వడ్డెర సంఘం చెందిన ఇరగదిండ్ల రమేష్ సన్నాఫ్ బాలయ్య ఇటీవల మృతి చెందినాడు కుటుంబానికి వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వెంకటేష్ హుస్నాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు మరియు అక్కన్నపేట వడ్డెర సంఘం మండల అధ్యక్షులు ఇరగదిండ్ల కుమార్ గారు గొల్లపైన ప్రశాంత్ శీను గొల్లబోయిన సమ్మయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు అలాగే ఆ కుటుంబానికి ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బంక చందు తెలిపారు.

## ఆక్రమ కట్టడాలకు గురవుతున్న ఆటో స్టాండ్



**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 27 2024 (వాయిస్ టుడే):** బెల్లంపల్లిలోని ఆటో స్టాండ్లను కబ్జా చేసి అక్రమ కట్టడాలు జరుపుతున వారిపై చర్యలు తీసుకోవాలని ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కబ్జాకు గురవుతున్న ఆటో స్టాండ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆటో యూనియన్కి కేటాయించాలని కోరారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
మంగళవారం, 28 మే, 2024

# మెకానిక్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న వ్యక్తి వడ్ల కుప్పను ఢీకొని మృతి

### వడ్ల కుప్పల వల్ల ప్రమాదం జరుగుతున్న పట్టించుకోని అధికారులు



**వాయిస్ టుడే మే 28 ( సిద్దిపేట్ జిల్లా):** గజ్వేల్ నియోజకవర్గం రాత్రి సమయంలో వడ్లపై నల్లటి టర్పాలిన్ కవర్లు కప్పడంతో బైక్ మెకానిక్ వృత్తిపైనే ఆధారపడి నా వ్యక్తి నవీన్ వడ్ల కుప్పను ఢీకొని మృతి చెందిన సంఘటన మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది.శనివారం రోజున ఎర్రవల్లి గ్రామంలో ఉన్నటువంటి తన బైక్ మెకానిక్ షాప్ మూసి వేసుకొని తన స్వగ్రామం అయిన యూసఫ్ ఖాన్ పల్లి గ్రామానికి వెళుతుండగా ఈ దారుణం చోటుచేసు కుంది. మార్గమధ్యలో వడ్ల కుప్పను ఢీకొని తలకు బలమైన గాయం అవ్వడంతో స్థానికులు గాంధీ ఆసుపత్రి లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రోజున రాత్రి సమయంలో మృతి చెందారు. మృతునికి అమ్మా,నాన్న లేరని కేవలం భార్య ఒక కొడుకు,కూతురు ఉన్నారని, మెకానిక్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి మెకానిక్ యూనియన్ సభ్యులు, చుట్టుపక్కల గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. గత ఏడాదిలో కూడా అదే శివారులో మర్కుక్ మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు.ఈ వడ్ల కుప్పల మృతి పట్ల ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించకపోవడం బాధాకరమని వాహనదారులు, మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం జల కడవలు ఊరేగింపు



**వాయిస్ టుడే మే 28 (సిద్దిపేట జిల్లా):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపుర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ వేడుకలు కనుల పండుగ జరుగుతున్నాయి కళ్యాణ మహోత్సవ వేడుకలలో భాగంగా డప్పు చప్పులతో శివసత్తుల పూనకాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధులగా గుండా జల కడవలు మహిళలు నెత్తిన పెట్టుకొని పుట్ట కమ్మే కార్యక్రమం కమనీయంగా నిర్వహించారు అనంతరం ఆలయ ప్రగణంలో అన్నదానం నిర్వహించడంతోపాటు కాటమయ్యకు మొక్కులు అప్పజెప్పి లందకు వెళ్ళుట అనంతరం గంగ తిప్ప కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కులస్తులు భక్తులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



**షాద్ నగర్ /వాయిస్ టుడే /మే 27 షాద్నగర్:** ఫరూక్నగర్ మండలం బూర్గుల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఎన్ హెచ్ 44 ఫంక్షన్ హాల్లో రాయికల్ లో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది అప్పటి పూర్వ ప్రధానోపాధ్యాయులు కోట శశిధర్ సార్ ఆధ్వర్యంలో జరిగింది 2006.2007బ్యాచ్ విద్యార్థులందరూ కలిసి గత అనుభవాలను జ్ఞాపకాలను ఉపాధ్యాయులతో కలిసి పంచుకోవడం చాలా ఆనందంగా ఉన్నవి విద్యార్థులు తాము చదువుతున్న రోజులను గుర్తు చేసుకొని చాలా రోజుల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు తమ 17 సంవత్సరాల తర్వాత అందరూ ఒక్కచోట కలవడం చాలా ఆనందాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామ్మోహన్ రెడ్డి శివకాంత్ హజారే శ్రీకాంత్ రమేష్ వీరాచారి మురళి నరేష్ కవిత మాధవి మంజుల పాల్గొన్నారు.

# పిల్లలకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమే

### సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపులో జిఎం (సెక్యూరిటీ), జిఎం(పర్సనల్) వెల్ఫేర్, ఆర్‌సి(ఎఫ్ఏసి) బిఆర్.ధీక్షితులు




**(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 27):** సోమవారం నాడు సింగరేణి కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు మరియు పరిసర ప్రాంత 18 సంవత్సరాల లోపు బాల బాలికలకు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్,బాక్సింగ్, ఫుట్ బాల్, వాలీబాల్, ఉషు/కరాటే, డ్రాయింగ్ మొదలగు వివిధ క్రీడా విభాగాలలో తేదీ 26.04.2024 నుండి 20.05.2024 వరకు జరిగిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి జిఎం(సెక్యూరిటీ) జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఆర్‌సి(ఎఫ్ఏసి) బిఆర్.ధీక్షితులు ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లను ఉద్దేశించి మాట్లాడుతూ.పిల్లలకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి, సృజనాత్మ కు,శారీరక ధృడత్వానికి ఎంతో ఉపయోగపడే క్రీడలు కూడా ఎంతో అవసరమని ఇందుకై సింగరేణి సంస్థ ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న ఈ క్రీడలను ఎప్పుడు ఆడుతూ చదువు తో పాటు క్రీడలలో కూడా రాణించాలని తెలిపారు. అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో పాల్గొన్న పిల్లలకు సర్టిఫికెట్ల తో పాటు స్పోర్ట్స్ ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎం(సెక్యూరిటీ) జిఎం(పర్సనల్) వెల్ఫేర్, ఆర్‌సి(ఎఫ్ఏసి) బిఆర్.ధీక్షితులు తో పాటు ఏజిఎం(పర్సనల్) కే.శ్రీనివాస రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ( ఎ ఐ టి యు సి) ఏస్ వి రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ (ఐ ఎన్ టి యు సి) పితాంబరం, కార్పొరేట్ సి ఏం ఓ ఏ ఐ ప్రెసిడెంట్ ఏం విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ పిఓ స్పోర్ట్స్ మేనేజర్ జికే.కిరణ్ కుమార్, కార్పొరేట్ హనరరీ సెక్రటరీ టి.శ్రీనివాస రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి.పోస్ నెట్, స్పోర్ట్స్ కొ ఆర్డినేటర్ ఏవి రమేష్, శిక్షకులు, బాల బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతన్నలు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

### మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి



**వాయిస్ టుడే మే 28 ( సిద్ధిపేట జిల్లా):** గజ్వేల్ నియోజకవర్గం మర్కూక్ రైతు వేదిక లో వ్యవసాయ రంగంలో పంటల సాగు విధానంలో పంట ఉత్పత్తులను అధికంగా సాధించాలంటే శ్రేష్టమైన విత్తనాన్ని ఎంచుకోవడం చాలా కీలకం అని మర్కుక్ మండల వ్యవసాయ అధికారి టి నాగేందర్ రెడ్డి రైతులతో అన్నారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోని యెడల పంట సాగులో విత్తనాలు మొలకెత్తకపోవడం, ఎక్కువగా తెగుళ్ళు, చీడపీడలు ఆశించడం వంటి సమస్యలను రైతులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మర్కుక్ రైతు వేదికలో రైతులకు వ్యవసాయం గురించి పలు జాగ్రత్తలు సూచించారు. రైతులతో మాట్లాడుతూ మంచి నాణ్యత, మొలకెత్తే శక్తి కలిగిన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి. విత్తనాలను ఎంచుకొనే క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటించి అధీకృత విత్తన డీలర్ల వద్దనే కొనుగోలు చేసుకోవాలి. ఇలా కొనడం ద్వారా పంటనష్టం జరిగినపుడు రైతులు వ్యవసాయ ఉన్నత అధికారులను సంప్రదించి నష్టపరిహారం పొందవచ్చు అని అన్నారు.విత్తనాలు ఉన్న సంచులు సరైన సీలుతో ధృవీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలని.విత్తన సంచులపై విత్తనరకం, ల్యాబ్ నంబర్, గడువు తేది తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేవో చూసుకున్న తరువాత మాత్రమే కొనుగోలు చేసుకోవాలి అని రైతులకు సూచించారు. విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత అధీకృత డీలర్ నుండి బిల్లుపై (రశీదు) సంతకం తీసుకోవాలి. హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపరమైన నాణ్యతను లేబుల్ మీద ఉన్నాయో లేదో గమనించి కొనుగోలు చేయాలి అని అన్నారు. పంటకు నష్టం జరిగితే రైతుకు రశీదే కీలక ఆధారం అని, కాబట్టి పంట కాలం పూర్తయ్యే వరకు కొనుగోలు చేసిన బిల్లును జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. సీల్ తీసి ఉన్న విత్తన సంచులు, పగిలిన విత్తన ప్యాకెట్లు,మూతలు తీసిన డబ్బాల్లోని విత్తనాన్ని కొనుగోలు చేయరాదు అని,విత్తనాన్ని కొనుగోలు చేసే క్రమంలో విత్తన సంచి బరువు తక్కువగా అనిపిస్తే డీలర్ ముందు తూకం వేయించి తీసుకోవాలి అనిఅన్నారు. విత్తన మొలక, పూత దశలో పంటల ఎదుగుదల సరిగా లేకపోతే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు తెలియచేసి క్షేత్రానికి తీసుకవెళ్ళి చూపించాలి అని అన్నారు. విత్తనం ఎక్కడ తయారీ అయ్యిందో ఏ కంపెనీ పంపిణీ చేసారో, విత్తనం అమ్మిన దుకాణదారుడి ద్వారా తెలుసుకోవాలి అని అన్నారు.వీటిలో ఏ విధమైన సంతృప్తి సమాధానం పొందలేని యెడల వ్యవసాయ శాఖ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికార్లు రజినీకాంత్, విష్ణు వర్ధన్, భాను మరియు రైతులు పాల్గొన్నారు.

# పాల్వంచ మండలంలో దొంగ చాటుగా మట్టి తరలింపు

### నిద్రావస్థలో పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, విద్యుత్ విద్య, లేబర్, ఆర్టీవో శాఖలు...

### ఇటుక బట్టీలో మగ్గుతున్న బాల్యం....



**కామారెడ్డి బ్యూరో మే 27 వాయిస్ టుడే:** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం భవానిపేట గ్రామం నుండి గత పది రోజుల గా జిల్లా స్థాయి అధికారుల నుండి అనుమతులు లేకుండా దొంగచాటుగా జెసిబి లు, హిటాచీలు, 40 ట్రాక్టర్లు 20 టిప్పర్లు రాత్రి ,పగలు, తేడా లేకుండా భవానిపేట చెరువులో నుండి ఇటుక బట్టి నిర్వాహకుడు మల్యాద్రి ఇటుక బట్టీలోకి మట్టి డంపు చేస్తున్న పోలీస్, రెవిన్యూ, ఇరిగేషన్, మైనింగ్, విద్యుత్, విద్యా, లేబర్ ఆర్టీవో శాఖలు నిద్ర వస్తులో ఉన్నాయి. ఇటుకబట్టి నిర్వాకుడు మాల్యాద్రినీ ఇదేంటని ప్రశ్నించగా అందరికీ మామూలు ముట్టాయి, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం కొసమెరుపు, పై విషయమై అధికారులకు పైకముట్టినట్టేనని నిర్ధారణ అయింది. నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం జిల్లా స్థాయి అధికారులు గత పది రోజుల నుండి రాత్రి పగలు అక్రమంగా, అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న పట్టించుకోకపోవడంపై పలు శాఖలపై పలు అనుమానాలు నెలకొన్నాయి? సారావంతమైన మట్టిని రైతుల పొలాలకు తరలిస్తే అధిక దిగుబడి వస్తుంది. ఇటుక బట్టి నిర్వాహకుడు మల్యాద్రి అక్రమాల తో కోట్ల విలువైన మట్టిని ఇటుక బట్టీలకు తరలించడం వెనుక ఒక రాజకీయ నాయకుడి అండదండలు ఉన్నాయని, ఊరిని ఉద్ధరిస్తే బాగానే ఉంటుంది. కానీ డబ్బుకు అమ్ముడుపోయి. ఇటుక బట్టి పెట్టి పాత్రికేయులని ఏం చేసుకుంటారో చేసుకోండి. అనేంత ధైర్యం నిర్వాహకుడు మాల్యాద్రి కి వచ్చిందంటే చీకటి వ్యాపారము ప్రజల తిరుగుబాటు తో అసలు రహస్యం బయటపడింది.! పై విషయంలో సంబంధిత శాఖల అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారు. మట్టి తరలింపు పై పాల్వంచ తహసిల్దార్ జయంతి రెడ్డిని వివరణ కోరగా మట్టి అనుమతులు ఇవ్వలేమని అలాగే ఎలాంటి ఫిర్యాదు మా దృష్టికి రాలేదన్నారు. అదేంటి గత ఎనిమిది పది రోజుల నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న మీ దృష్టికి రాకపోవడం ఏంటని వాయిస్ టుడే ప్రతినిధి ప్రశ్నించగా, మాకు జిల్లా కలెక్టర్ పాడి కొనుగోలు కేంద్రాలపై దృష్టి పెట్టాలని అన్నారని సమాధానం ఇచ్చారు.

ఎస్సై శ్రీనివాస్ రెడ్డిని వాయిస్ టుడే ప్రతినిధి వివరణ కోరగా, అది మా పరిధిలోకి రాదని తాసిల్దార్ పట్టుకొని మాకు అప్పగిస్తే మేము మైనింగ్ శాఖ అధికారులకు అప్పచెప్తామన్నారు. అదేంటి పోలీస్ శాఖ నైట్ పెట్రోలింగ్ చేస్తుండగా మీకు వాహనాలు కనిపించడం లేదా అని ప్రశ్నించగా ఎంక్వయిరీ చేస్తానని ఫోన్ కట్ చేశారు. ఇరిగేషన్ శాఖను వివరణ కోరగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కు అనుమతి ఇచ్చామని, ఏపీవో ద్వారా ఉపాధి కూలీల ద్వారా ట్రాక్టర్లో తో వ్యవసాయ పొలాలకు మాత్రమే అనుమతిచ్చామని ఇరిగేషన్ ఈ ఈ పోచమల్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీలు కాకుండా యంత్రాలను వాడినట్టు రుజువైతే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మాచారెడ్డి ఏపీవో తో సమాచారం తీసుకుంటామన్నారు.

# కత్తితో పొడిచి పారిపోతూ, దోపిడీలు చేస్తున్న ముఠా అరెస్ట్



**సికింద్రాబాద్, మే 27(వాయిస్ టుడే ప్రతినిధి):** పాతకక్షలను మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి పారిపోతూ మరో వ్యక్తిని బెదిరించి, సెల్ఫోన్, డబ్బులు లాక్కున్న దుండగులను లాలాగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు లాలాగూడ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రావుల గిరిధర్ కేసు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్త్ లాలాగూడలోని జామియా మసీదు ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ ఆసిఫ్ రెహ్మాన్ (31) అలియాస్ టైగర్ అనే వ్యక్తి వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. తన ఇంటి సమీపంలో నివాసముండే తాడూరి కృష్ణ అనే వ్యక్తితో టైగర్కు పాత గొడవలు ఉన్నాయి. అవి మనసులో పెట్టుకున్న టైగర్ ఈ నెల 24న కృష్ణపై కత్తితో దాడి చేయగా, అతని మెడపై గాయమైంది. దీంతో అక్కడి నుంచి టైగర్ తో పాటు తన స్నేహితులైన సోహైల్ షేక్ చాంద్ (19) అలియాస్ సోహైల్ (వృత్తిరీత్యా పెయింటర్), మరో బాలుడితో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై పర్యారయ్యాడు. ఈ క్రమంలో లాలాగూడలోని రైల్వేక్వార్టర్స్ ప్రాంతంలో మహ్మద్ అఫ్రోజ్కు కత్తి చూపిస్తూ బెదిరించి, అతని నుంచి సెల్ఫోన్ను 70రూపాయలు లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు లాలాగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సోమవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక ఫోల్డెడ్ కత్తి, హీరో ఫ్యాషన్ బైక్, హోండా యాక్టివా, ఒక సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరిని రిమాండ్కు, బాలుడిని జువైనల్ హోమ్కు తరలించారు. టైగర్ పై ఇది వరకు లాలాగూడ పోలీస్ స్టేషన్లో ఆర్మ్స్ యాక్ట్, హత్యాయత్నం, ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసులు, బాలుడిపై మార్కెట్ పోలీస్ స్టేషన్లో ఐపీసీ 382 కింద, లాలాగూడ పోలీస్ స్టేషన్లో లో ఐపీసీ 379 కింద కేసులు గతంలో నమోదయ్యాయి. ఈ సమావేశంలో ఏసీపీ జైపాల్రెడ్డి, ఇంచార్జి సీఐ రమేష్గౌడ్, ఎస్సైలు నాగరాజుయాదవ్, షాహీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# టెస్కాబ్ చైర్మన్‌పై అవిశ్వాసం

### డైరెక్టర్ల నోటీసులు.. 10న అవిశ్వాసం

### ఆలోపే చైర్మన్ రవీందర్‌రావు రాజీనామా?

**హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ కొండూరి రవీందర్‌రావుపై బోర్డు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. దీంతో సమావేశం నిర్వహించేందుకు టెస్కాబ్ నిర్ణయించింది. వచ్చే నెల 10వ తేదీన అవిశ్వాస తీర్మానానికి ఏర్పాటు చేసింది. గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొండూరి రవీందర్‌రావు టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం ఈ ఏడాది లోపు పూర్తికానుంది. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి అనుకూలంగా మారిన డైరెక్టర్లు రవీందర్‌రావును చైర్మన్ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించారు. బోర్డులో మొత్తం 9 మంది డైరెక్టర్లు ఉండగా ఏడుగురు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు. వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే చైర్మన్ పదవిలో ఉండాలంటే కాంగ్రెస్‌లోకి రావాలంటూ రవీందర్‌వుపై కొందరు నేతలు ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. కానీ రవీందర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అంగీకరించకపోవడంతో ఆయనపై అవిశ్వాస అస్త్రా న్ని ప్రయోగించినట్లు తెలిసింది.

# పక్షవాత వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సహాయం



**రామకృష్ణాపూర్ మే 27 (వాయిస్ టుడే):** రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్కే-4 గడ్డ నందు నివాసముంటున్న గుజ్జ సుధాకర్, మదనక్క దంపతులకు పద్మశాలి సంఘం కుల బాంధవులు వారికి సోమవారం 28.626 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీ ఆడెపు తిరుపతి, అధ్యక్షులు ఆడెపు కృష్ణ మాట్లాడుతూ గుజ్జ సుధాకర్ గత కొంతకాలంగా పక్షవాతం వచ్చి కదలలేని పరిస్థితిలో ఉన్నాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితి బాగోలేక వైద్య చేపించుకోవడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని వాట్సాప్ గ్రూప్ ద్వారా విషయం తెలుసుకొని పద్మశాలి సంఘం తరఫున సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి గుజ్జ సుధాకర్ చికిత్స కోసం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కనుకుంట్ల సమ్మయ్య, అక్కపల్లి సమ్మయ్య, స్టీరింగ్ కమిటీ సభ్యులు బొద్దున మల్లేష్, ఆడెపు లచ్చన్న, ఇప్పకాయల లింగయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండ కుమార్, జాయింట్ సెక్రటరీ వేముల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ 'ముజ్రా' వ్యాఖ్యలు ఆక్షేపణీయం: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:** ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఇండియా కూటమి ముజ్రా డ్యాన్స్ చేస్తోందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దేశ ప్రధానిగా 130 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సిన వ్యక్తి తాను ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం దురదృష్టకరమని, ఇలాంటి వ్యాఖ్యలను గతంలో ఏ ప్రధాని చేయలేదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ చూపిన ఔదార్యం కారణంగానే రెండు మతాల మధ్య రాజుకున్న అగ్గి ఆరిపోయి ప్రజలంతా కలిసి ఉంటున్నారని, ఆ రోజుల్లో మోదీ ప్రధాని అయి ఉంటే ఆ మతవిద్వేషాలు ఇప్పటికీ రగులుతుండేవని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. దేశంలో పుట్టి పెరిగిన వారంతా భారతీయులేనని, వారి పట్ల వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. బీజేపీ ఎప్పటికీ దేశ పౌరులందరికీ ప్రాతినిధ్యం వహించలేదని తెలిపా రు. లౌకిక భావనలు ఈ నేలలో, నీటిలో, గాలి లో ఉందని, దాన్ని బీజేపీ వేరు చేయలేదని ఆ ప్రకటనలో శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.